బుధవారం
WEDNESDAY
7-10-2026
సంపుటి ( Volume):2 ॥ సంచిక: (Issue): 99
జగిత్యాల JAGITIAL ॥ పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385
www.evarthalu.com

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play




# మోదీ.. 25 ఏళ్ల వైభవమిదీ!

**ప్రధానికి కేంద్ర కేబినెట్ అభినందనలు**

**మోదీ కార్యక్రమాలపై ప్రశంసలు**

**కీలకాంశాలతో తీర్మానం ఆమోదం**

ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్ల సుదీర్ఘ నాయకత్వాన్ని పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలుపుతూ కేంద్ర మంత్రివర్గం మంగళవారం తీర్మానం ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన కార్యక్రమాల నుంచి ప్రధానమంత్రిగా కొనసాగుతున్న పాలనా ప్రస్థానం వరకు పలు అంశాలను తీర్మానంలో ప్రస్తావించింది. 'దేశమే ప్రథమం, పౌరుడే ప్రథమం' అనే విధానంతో ఆయన చేపట్టిన కార్యక్రమాలను వివరించింది.

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (పీఐబీ): గుజరాత్ నుంచి దేశవ్యాప్త అభివృద్ధి విధానాల వరకు గుజరాత్‌లో అమలు చేసిన పలు కార్యక్రమాలను జాతీయ స్థాయిలో విస్తరించిన విధానాన్ని కేంద్ర కేబినెట్ తీర్మానం ప్రస్తావించింది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రారంభించిన 'స్వాగత్' కార్యక్రమానికి 2010లో ఐక్యరాజ్యసమితి ప్రజా సేవా పురస్కారం లభించింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను సమీక్షించి, అడ్డంకులను పరిష్కరించి, పనులను వేగవంతం చేసేందుకు చేపట్టిన 'ప్రగతి' కార్యక్రమానికి ఈ విధానం స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొంది. వ్యవసాయానికి తరువాయి 2 వ పేజీలో...

# ఎర్రవల్లిలో 45 ఎకరాలు గల్లంతు!

## భూములపై సీఎం రేవంత్ సమీక్ష.... సర్వేలో 45 ఎకరాలు తేడా..?

**రికార్డుల కోసం కేసీఆర్‌కు నోటీసులు.. ఆ భూమిలో 'అమరుల కాలనీ' నిర్మాణం.. జూన్ 2 నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు**

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల భూముల సర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

సిద్దిపేట, అక్టోబర్ 6 (ఈవార్తలు): ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ 'అమరవీరుల కాలనీ' నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచిం చారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్ప గిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.



# చలికాలమా... ఎండాకాలమా?



**అక్టోబర్‌లోనూ తగ్గని ఎండలు.. రాత్రివేళ ఉక్కపోత**

**ఎల్‌నినో ప్రభావంతో వేడెక్కుతున్న తెలంగాణ**

**వర్షపాతం లోటుతో అడుగంటుతున్న జలాశయాలు**

**డిసెంబర్ నుంచే హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు?**

తెలంగాణలో వాతావరణ పరిస్థితులు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. అక్టోబర్ వచ్చేసినా చలికాలం ఛాయలు కనిపించడం లేదు. పగలంతా ఎండలు మండుతుండగా.. రాత్రివేళ ఉక్కపోత తప్పడం లేదు. సాధారణంగా వర్షాకాలం ముగిసిన తర్వాత వాతావరణం క్రమంగా చల్లబడాలి. కానీ ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఉదయం నుంచే వేడి మొదలై రాత్రి వరకు కొనసాగుతోంది. దీంతో ప్రజలు 'ఇది చలికాలానికి ముందు సమయమా? లేక ఎండాకాలం కొనసాగుతోందా?' అని ఆశ్చర్యపోతున్నారు.

(ఈవార్తలు - స్పెషల్ బ్యూరో)

హైదరాబాద్‌లో అక్టోబర్ 7న గరిష్ఠ ఉష్ణోగ్రత 34 డిగ్రీల వరకు, కనిష్ఠం 23 డిగ్రీల వరకు నమోదయ్యే పరిస్థితి ఉంది. పగటి వేడి, గాలిలో తేమ కలిసి ప్రజలకు అసౌకర్యాన్ని పెంచుతున్నాయి. అక్టోబర్ ప్రారంభంలోనే తెలంగాణలో పలుచోట్ల 36-37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ 35 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాలున్నాయి. వర్షాకాలం ముగిసిన తర్వాత అక్టోబర్‌లో వాతావరణం క్రమంగా పొడిగా మారినా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతూ చల్లదనం తరువాయి 2 వ పేజీలో...

# ఎస్ఎంఈకి 10 వేల కోట్లు

**చిన్న, మధ్య తరహా సంస్థల విస్తరణకు భారీ నిధి**

**రవాణా-సరఫరా వ్యవస్థకు సమగ్ర ప్రాధికార సంస్థ**

**కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు**



న్యూఢిల్లీ, అక్టోబర్ 6: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చిన్న, మధ్య తరహా సంస్థల విస్తరణకు దీర్ఘకాలిక మూలధనాన్ని అందించేందుకు రూ.10 వేల కోట్ల ఎస్ఎంఈ వృద్ధి నిధిని ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశంలోని రవాణా, సరఫరా వ్యవస్థల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు సమగ్ర రవాణా, సరఫరా వ్యవస్థల ప్రాధికార సంస్థ ఏర్పాటుకు కూడా ఆమోదం తెలిపింది. చిన్న, మధ్య తరహా సంస్థలకు వృద్ధి దశలో అవసరమైన దీర్ఘకాలిక వాటా మూలధనాన్ని అందించడమే ఈ నిధి తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,022 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,270 |

# 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం

**తెలంగాణలో తీవ్ర కరువు పరిస్థితులు.. ఎల్ నినో ప్రభావంతోనే ఈ పరిస్థితి**

**రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక అంచనా.. సమగ్ర నివేదికకు సీఎస్ ఆదేశాలు**

**త్వరలో కరువుపై అఖిలపక్ష సమావేశం.. కేంద్ర సాయం కోరేందుకు ఢిల్లీకి**

ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది.



హైదరాబాద్, అక్టోబర్ 6 (ఈవార్తలు): ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ -2 వ పేజీలో...




# భారత జీడీపీ వృద్ధి రేటు 7.1%

**వరల్డ్ బ్యాంక్ తాజా అంచనా**

**బలంగా పారిశ్రామిక రంగం**

**ప్రైవేట్ వినియోగం, ఎగుమతుల వృద్ధి**

**వ్యవసాయంపై రుతుపవనాల ప్రభావం**

**నివేదికలో కీలక అంశాలు వెల్లడి**

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై ప్రపంచ బ్యాంకు తన సానుకూల అంచనాలను వెలువరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాను 7.1 శాతానికి పెంచుతున్నట్లు మంగళవారం వెల్లడించింది. గత ఏప్రిల్‌లో ఈ వృద్ధి అంచనా 6.6 శాతంగా ఉండగా, తాజాగా దానిని 0.5 శాతం మేర సవరించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (క్యూ1) వృద్ధి రేటు అంచనాలను మించి 7.8 శాతంగా నమోదు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన తాజా 'ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్' నివేదికలో స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో బలమైన పెట్టుబడులు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం కారణంగా వృద్ధి రేటు 7.8 శాతానికి చేరుకుందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. ఇదే ఒరవడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగుతోందని, తరువాయి 2 వ పేజీలో...



# ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు భౌతిక శాస్త్ర నోబెల్

**మంచుగడ్డతో విశ్వ రహస్యాల ఛేదన**

లండన్: భౌతిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి-2026ని అమెరికాలోని విస్కాన్సిన్-మాడిసన్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ గెలుచుకున్నారు. దక్షిణ ధ్రువంలో 'ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ' ఏర్పాటుకు ఆయన చేసిన విశేష కృషి, అత్యంత శక్తిమంతమైన ఖగోళ న్యూట్రినోలను కనుగొన్నందుకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. దక్షిణ ధ్రువంలోని స్వచ్ఛమైన మంచును తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




డీఆర్‌డీఓ తన ప్రస్థానంలో మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ (హెచ్ఏపీఎస్) ప్రయోగాత్మక పరీక్షను మంగళవారం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా ఎయిర్ షిప్ ఏకంగా 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, భారత నిఘా, వైమానిక సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన విజయాన్ని నమోదు చేసింది.

# 100 మంది 'సైబర్' ఏజెంట్లు అరెస్ట్




**సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు**

**సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్**

**ఏపీ, టీజీ సహా 5 రాష్ట్రాల్లో సోదాలు**

హైదరాబాద్, అక్టోబర్ 6 (ఈవార్తలు): సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముఠాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉక్కుపాదం మోపింది. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు దక్షిణ రాష్ట్రాల్లో చేపట్టిన మెగా ఆపరేషన్‌లో 100 మందికి పైగా ఏజెంట్లను అరెస్టు చేసింది. సైబర్ మోసగాళ్లకు 'మ్యూల్' బ్యాంకు ఖాతాలు, కేవైసీ పత్రాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బ్యూరో ప్రత్యేక బృందాలు సోదాలు తరువాయి 2 వ పేజీలో...

# 35 మంది 'ఫేక్' లెక్చరర్లు

**తొలగిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం.. మరో 320 మందిపై విచారణ**



హైదరాబాద్, అక్టోబర్ 6 (ఈవార్తలు): తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై తరువాయి 2 వ పేజీలో...



# శ్రీలంకలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్..

**8 మంది భారతీయుల అరెస్ట్.. 6 కంప్యూటర్లు, 39 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

కొలంబో: శ్రీలంక రాజధాని కొలంబోలో అక్రమంగా ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై ఎనిమిది మంది భారతీయ పౌరులను శ్రీలంక పోలీసులు అరెస్ట్ చేశారు. కొలంబో శివారు ప్రాంతమైన తలవతుగోడలోని ఒక నివాసంలో ఈ గ్యాంబ్లింగ్ నెట్ వర్క్‌ను నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. తలంగమ పోలీసులకు అందిన పక్కా సమాచారంతో ఈ అరెస్టులు జరిగాయి. కడువెల మేజిస్ట్రేట్ కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తరువాయి 2 వ పేజీలో...



# మోదీ.. 25 ఏళ్ల వైభవమిదీ!

**మొదటి పేజీ తరువాయి**

ప్రత్యేక విద్యుత్ ఫీడర్ల ఏర్పాటు కోసం గుజరాత్‌లో అమలు చేసిన 'జ్యోతిగ్రామ్' విధానాన్ని కూడా ప్రస్తావించింది.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

పేదలకు ఇళ్లు, తాగునీరు, బ్యాంకింగ్, వైద్య సేవలు అందించేందుకు చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను తీర్మానం ప్రస్తావించింది. దాదాపు 60 కోట్ల జనధన్ ఖాతాలు, 4 కోట్లకు పైగా ఇళ్ల నిర్మాణం, పేదరికం నుంచి కోట్లాది మంది బయటపడటం వంటి అంశాలను ఇందులో పేర్కొంది. సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అమలు చేయడం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

అన్ని వర్గాల సాధికారత

మహిళలు, యువత, రైతులు, గిరిజనులు సహా వివిధ వర్గాల సాధికారతకు చేపట్టిన చర్యలను తీర్మానం వివరించింది. సుమారు 3.5 కోట్ల మంది మహిళలు 'లఖ్‌పతి దీదీ'లుగా మారారని పేర్కొంది. 'నారీ శక్తి వందన్ అధినియమ్' ద్వారా చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని ప్రస్తావించింది. అంకుర సంస్థలు, నైపుణ్యాభివృద్ధి, విద్య రంగాల్లో చేపట్టిన చర్యలను కూడా పేర్కొంది. 'పీఎం కిసాన్' పథకం ద్వారా రైతుల ఖాతాల్లోకి రూ.4 లక్షల కోట్లకు పైగా నిధులు బదిలీ చేసినట్లు తెలిపింది. అత్యంత వెనుకబడిన గిరిజన తెగల కోసం 'పీఎం-జన్మన్' పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

సంస్కరణలకు ప్రాధాన్యం

రాజకీయ సవాళ్ల మధ్య కూడా పలు సంస్కరణలను అమలు చేసినట్లు తీర్మానం పేర్కొంది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు, సంక్షేమ పథకాల పంపిణీలో మార్పులు, బ్రిటిష్ కాలం నాటి చట్టాల స్థానంలో కొత్త చట్టాల అమలు వంటి చర్యలను ప్రస్తావించింది. పారిశుధ్యం, డిజిటల్ చెల్లింపులు, స్థానిక ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలను కూడా పేర్కొంది.

స్వావలంబన దిశగా అడుగులు

ప్రభుత్వ మూలధన వ్యయం రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు పైగా పెరిగిందని తీర్మానం తెలిపింది. జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే విద్యుదీకరణ వేగవంతమైనట్లు పేర్కొంది. ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.13 లక్షల కోట్లకు పైగా పెరిగిందని తెలిపింది. రక్షణ ఉత్పత్తులు, అర్ధవాహక పరికరాల తయారీ రంగాల్లో పురోగతిని కూడా ప్రస్తావించింది.

సాంకేతికత వినియోగం

జనధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్ అనుసంధానం ద్వారా సంక్షేమ పథకాల అమలును మెరుగుపరిచినట్లు తీర్మానం పేర్కొంది. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులు విస్తరించిన విషయాన్ని ప్రస్తావించింది. దేశీయంగా కోవిడ్ టీకాల తయారీ, చంద్రయాన్-3ను చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో విజయవంతంగా దింపడం వంటి అంశాలను కూడా పేర్కొంది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం, కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతికత, జీవసాంకేతిక రంగాల్లో పురోగతిని ప్రస్తావించింది.

సంక్షోభ సమయాల్లో నాయకత్వం

కోవిడ్ మహమ్మారి సమయంలో స్వదేశీ టీకాల తయారీ, టీకాల పంపిణీ కార్యక్రమాలను చేపట్టినట్లు తీర్మానం పేర్కొంది. పశ్చిమాసియా సంక్షోభం సమయంలో ఇంధన భద్రతకు తీసుకున్న చర్యలను కూడా ప్రస్తావించింది. సంక్షోభ పరిస్థితుల్లో తక్షణ నిర్ణయాలతో పాటు ముందస్తు వ్యూహాత్మక చర్యలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపింది.

జాతీయ భద్రతకు ప్రాధాన్యం

2016 సర్జికల్ దాడులు, 2019 బాలాకోట్ వైమానిక దాడులు, 2025 ఆపరేషన్ సిందూర్‌ను తీర్మానం ప్రస్తావించింది. జాతీయ భద్రతకు సంబంధించి తీసుకున్న చర్యల్లో భాగంగా ఆర్టికల్ 370 రద్దు, 'ఒకే ర్యాంకు-ఒకే పింఛను' అమలు, రక్షణ దళాల ప్రధానాధికారి (సీడీఎస్) పదవి ఏర్పాటు వంటి నిర్ణయాలను పేర్కొంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి స్థాపనకు చేపట్టిన కార్యక్రమాలను కూడా ప్రస్తావించింది.

అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రాధాన్యం

జీ20, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో భారత్ పోషించిన పాత్రను తీర్మానం ప్రస్తావించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలను అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించడం, ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో చేర్చడంలో భారత్ పాత్రను పేర్కొంది. 'టీకా మైత్రి' కార్యక్రమం ద్వారా ఇతర దేశాలకు టీకాలను అందించిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. వివిధ దేశాల నుంచి మోదీకి లభించిన అంతర్జాతీయ గౌరవాలను కూడా తీర్మానంలో పేర్కొన్నారు.

వారసత్వం, బాధ్యతతో కూడిన అభివృద్ధి

పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక ఇంధనం, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించిన కార్యక్రమాలను తీర్మానం ప్రస్తావించింది. వాతావరణ మార్పులపై చర్యల నుంచి పునరుత్పాదక ఇంధన విస్తరణ వరకు చేపట్టిన కార్యక్రమాలను పేర్కొంది. యోగా, చిరుధాన్యాల ప్రోత్సాహం, కాశీ విశ్వనాథ్ ధామ్ అభివృద్ధి, అయోధ్యలో రామమందిర నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలను కూడా ప్రస్తావించింది. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలనే లక్ష్యంతో తీర్మానం ముగిసింది.

## శ్రీలంకలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్..

**మొదటి పేజీ తరువాయి**

పొందిన అనంతరం, సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ సహకారంతో పోలీసులు ఆ నివాసంపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా 22 నుంచి 51 ఏళ్ల మధ్య వయసున్న భారతీయ పౌరులేనని పోలీసులు ధ్రువీకరించారు. దాడి సందర్భంగా ఆ గృహం నుంచి ఆరు కంప్యూటర్లు, 39 మొబైల్ ఫోన్లు, పెద్ద సంఖ్యలో కంప్యూటర్ యాక్సెసరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహణ కోసమే వీటిని వినియోగిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. విదేశీయులు పాల్పడుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై శ్రీలంక అధికారులు ఇటీవల కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ అరెస్టులు కూడా అందులో భాగమేనని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఈ ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ నెట్‌వర్క్ ఎంత విస్తరించింది, దీని వెనుక ఇంకా ఎవరి హస్తమైనా ఉందా అనే కోణంలో లోతైన విచారణ జరుపుతున్నారు.

# చలికాలమా? ఎండాకాలమా?



మొదలవుతుంది. ఈసారి మాత్రం ఆ మార్పు అంతగా కనిపించడం లేదు. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం తెలంగాణలో ఈసారి శీతాకాలం సాధారణం కంటే వెచ్చగా ఉండే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో శీతాకాల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4-5 డిగ్రీల వరకు అధికంగా ఉండవచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రానికి చెందిన నిపుణులు ఇప్పటికే పేర్కొన్నారు. దీనికి తోడు ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితులు వాతావరణంపై ప్రభావం చూపుతున్నాయి. సాధారణంగా ఎల్‌నినో ప్రభావంతో భారతదేశంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతోపాటు ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈసారి దాని ప్రభావం వర్షపాతం లోటు రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది.

17 శాతం వర్షపాతం లోటు

తెలంగాణలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగిన నైరుతి రుతుపవనాల కాలం 17 శాతం వర్షపాతం లోటుతో ముగిసింది. సాధారణంగా ఈ కాలంలో 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి 'సాధారణ' పరిధిలో ఉన్నప్పటికీ 33 జిల్లాల్లో 18 జిల్లాలు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొన్నాయి. వర్షాలు సకాలంలో, సమృద్ధిగా పడకపోవడంతో భూగర్భ జలాలపైనా ప్రభావం పడుతోంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ భూగర్భ జలమట్టాలు దిగజారుతున్నాయని తాజా నివేదికలు చెబుతున్నాయి. దీంతో వర్షాభావం ప్రభావం కేవలం వ్యవసాయానికే పరిమితం కాకుండా తాగునీటి వనరులపైనా పడుతోంది.

హైదరాబాద్‌కు తాగునీటి గండం

వాతావరణంలో వేడి తగ్గకపోవడం ఒకవైపు అయితే.. మరోవైపు హైదరాబాద్‌కు తాగునీటి ముప్పు పొంచి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నగరానికి ప్రధాన నీటి వనరులైన జలాశయాల్లో నీటిమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. వర్షాభావం, జలాశయాల్లోకి తగ్గిన నీటి చేరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ముఖ్యంగా సింగూర్ జలాశయం పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. 29.9 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యం ఉన్న సింగూర్‌లో ప్రస్తుతం సుమారు 3.9 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అంటే పూర్తి సామర్థ్యంలో దాదాపు 13 శాతం నీరు మాత్రమే మిగిలింది. ఇదే పరిస్థితి కొనసాగితే మరో 60 రోజుల్లో.. అంటే డిసెంబర్ మధ్య నాటికి సింగూర్ ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉస్మాన్‌సాగర్‌లోనూ తగ్గుతున్న నిల్వ

హైదరాబాద్ పాతనగరం, పరిసర ప్రాంతాలకు కీలకమైన ఉస్మాన్‌సాగర్‌లోనూ నీటి నిల్వలు తగ్గిపోయాయి. గతంలో సుమారు 3.5 టీఎంసీలుగా ఉన్న నిల్వ ప్రస్తుతం 2.2 టీఎంసీలకు పడిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నాగార్జునసాగర్ నుంచి సింగూర్ వరకు పలు ప్రధాన జలాశయాల్లోకి నీటి చేరికలు తగ్గిపోవడంతో నగర తాగునీటి భద్రతపై ఆందోళన పెరుగుతోంది. సింగూర్‌పై ఆధారపడే హైదరాబాద్ పశ్చిమ ప్రాంతాలు, ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం విస్తరించిన ప్రాంతాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉంది. సింగూర్ నుంచి వచ్చే సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

వేసవి ముందే నీటి కష్టాలు?

సాధారణంగా హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి వేసవి చివరి నెలల్లో తీవ్రంగా ఉంటుంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో జలాశయాల నిల్వలు తగ్గడంతో నీటి సరఫరాపై ఒత్తిడి పెరుగుతుంది. కానీ ఈసారి పరిస్థితి ముందుగానే హెచ్చరికలు జారీ చేసే స్థాయికి చేరింది. డిసెంబర్ లేదా జనవరి నుంచే నీటి కొరత మొదలయ్యే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో వేసవి వరకు వేచి చూడకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని హైదరాబాద్ జలమండలి అధికారులను ఆదేశించింది. సింగూర్, మంజీరా నీటిపై ఆధారపడే ప్రాంతాలను గుర్తించి.. అవసరమైనప్పుడు ఏ ప్రాంతానికి ఏ ప్రత్యామ్నాయ వనరు ద్వారా ఎంత నీటిని అందించాలనే దానిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.

ముందు నీరు.. తర్వాతే ఇతర అవసరాలు

వర్షపాతం లోటు నేపథ్యంలో తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో నిల్వలు మరింత తగ్గితే వ్యవసాయ అవసరాలకు నీటి విడుదలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైందని, ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేసేందుకు చర్యలు చేపడుతోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఒకవైపు అక్టోబర్‌లోనూ ఎండలు.. మరోవైపు డిసెంబర్‌లోనే తాగునీటి కష్టాల హెచ్చరికలు.. తెలంగాణ ఎదుర్కొంటున్న వాతావరణ మార్పు పరిస్థితికి ఇది అద్దం పడుతోంది. చలికాలం రావాల్సిన సమయంలో వేడి పెరగడం, వర్షాలు తగ్గిపోవడం, జలాశయాలు అడుగంటడం.. ఇవన్నీ కలిసివచ్చి రాబోయే నెలల్లో నీటి నిర్వహణ ప్రభుత్వానికి, ప్రజలకు పెద్ద సవాలుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎస్ఎంఈకి 10 వేల కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

. ప్రధాన ఉద్దేశం. వ్యాపార సామర్థ్యాన్ని ఇప్పటికే నిరూపించుకున్న, భవిష్యత్తులో వేగంగా విస్తరించే అవకాశమున్న సంస్థల్లో నేరుగా వాటా పెట్టుబడులు పెట్టేందుకు ఈ నిధి ఉపయోగపడుతుంది. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.10 వేల కోట్లను ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధికి సమకూర్చేందుకు కట్టుబాటు తెలిపింది. ప్రారంభ దశలో ఉన్న సంస్థలు, సూక్ష్మ సంస్థలకు ఇప్పటికే అనేక నిధులు వాటా మూలధనాన్ని అందిస్తున్నప్పటికీ.. చిన్న, మధ్య తరహా సంస్థలు విస్తరణ దశకు చేరుకున్నప్పుడు అవసరమయ్యే దీర్ఘకాలిక మూలధనంలో లోటు ఉందని కేంద్రం పేర్కొంది. ఆ లోటును భర్తీ చేయడమే ఈ నిధి లక్ష్యం. తయారీ రంగంలోని చిన్న, మధ్య తరహా సంస్థలకు ఈ నిధిలో అధిక భాగాన్ని కేటాయించనున్నారు. రెండో, మూడో శ్రేణి నగరాల్లోని పారిశ్రామిక సముదాయాల్లో పనిచేస్తున్న సంస్థలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నిధుల ద్వారా సంస్థలు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, వ్యాపార కార్యకలాపాలను విస్తరించడం, అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించడం, ప్రపంచ విలువ గొలుసుల్లో భాగస్వాములు కావడం, వ్యూహాత్మక పెట్టుబడులు లేదా కొనుగోళ్లు చేపట్టడం వంటి అవకాశాలు పొందనున్నాయి. తయారీ, సేవలు, సాంకేతికత, ఆవిష్కరణ ఆధారిత రంగాలు, వ్యూహాత్మక విలువ గొలుసుల్లో భవిష్యత్‌లో ప్రపంచ స్థాయిలో పోటీపడగల భారతీయ సంస్థలను తీర్చిదిద్దడం కూడా ఈ నిధి లక్ష్యంగా ఉంది.

సమగ్ర రవాణా, సరఫరా వ్యవస్థల ప్రాధికార సంస్థ

దేశవ్యాప్తంగా రోడ్లు, రైల్వేలు, నౌకాశ్రయాలు, నౌకాయానం, పౌర విమానయానం, అంతర్గత జలరవాణా, తీరప్రాంత రవాణా, పట్టణ రవాణా, సరఫరా వ్యవస్థ వంటి వివిధ రవాణా మార్గాల మధ్య మెరుగైన సమన్వయం కోసం సమగ్ర రవాణా, సరఫరా వ్యవస్థల ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రత్యేక ప్రయోజన సంస్థగా ఏర్పాటు కానున్న ఈ సంస్థ దేశంలో రవాణా ప్రణాళిక, పరిశోధన, ప్రాజెక్టుల సాంకేతిక పరిశీలన, పర్యవేక్షణ, ప్రభావ అంచనా, సమాచార విశ్లేషణ వంటి అంశాల్లో అత్యున్నత సమన్వయ సంస్థగా పనిచేస్తుంది. ఈ సంస్థ కనీసం పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ రవాణా సమగ్ర ప్రణాళికను రూపొందిస్తుంది. వివిధ రవాణా మంత్రిత్వ శాఖలు రూపొందించే స్వల్పకాలిక, వార్షిక ప్రణాళికలు ఈ దీర్ఘకాలిక ప్రణాళికకు అనుగుణంగా ఉన్నాయా? వివిధ రవాణా మార్గాలను అనుసంధానించే మౌలిక వసతుల అభివృద్ధికి అవి దోహదపడుతున్నాయా? అనే అంశాలను పరిశీలిస్తుంది. కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వ్యయంతో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టులకు సాంకేతిక పరిశీలనను ఈ సంస్థ నిర్వహిస్తుంది. అయితే ఆ ప్రాజెక్టుల ఆర్థిక పరిశీలన మాత్రం ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాల ప్రకారమే కొనసాగుతుంది. ప్రాజెక్టుల అమలు సమయంలో పర్యవేక్షణతో పాటు.. పూర్తయిన తర్వాత వాటి ప్రభావాన్ని కూడా అంచనా వేస్తుంది.

రవాణాకు సంబంధించిన వివిధ సమాచారాన్ని ఒకే చోట సమీకరించేందుకు జాతీయ రవాణా సమాచార భాండాగారంను ఏర్పాటు చేయనున్నారు. పన్నుల వ్యవస్థకు సంబంధించిన సరకు రవాణా పత్రాలు, టోల్ చెల్లింపుల గుర్తింపు వ్యవస్థ, వాహనాల సమాచార వ్యవస్థ, ఉపగ్రహ ఆధారిత స్థాన నిర్ధారణ వ్యవస్థలు, పట్టణ ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థల నుంచి సమాచారాన్ని ఇందులో సమీకరించనున్నారు.

## ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు భౌతిక శాస్త్ర నోబెల్

**మొదటి పేజీ తరువాయి**

ఉపయోగించి న్యూట్రినోలను పట్టుకోవచ్చనే అద్భుతమైన ఆలోచనను ఫ్రాన్సిస్ హాల్జెన్ తొలిసారిగా 1988లో ప్రతిపాదించారు. మంచులో న్యూట్రినో అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు ఒక కాంతి వెలువడుతుందని, ఆ కాంతిని సెన్సార్ల ద్వారా గుర్తించవచ్చని ఆయన భావించారు. భూకంపాలు లేని స్థిరమైన భౌగోళిక ప్రాంతం కావడం, ఇతర జోక్యాలు తక్కువగా ఉండటంతో దక్షిణ ధ్రువం ఈ ప్రయోగానికి అత్యంత అనువైనదిగా నిరూపితమైంది. కొద్దికాలంలోనే ఆయన ఆలోచనకు ఇతర శాస్త్రవేత్తల మద్దతు లభించింది.

ఏమిటీ న్యూట్రినోలు?

న్యూట్రినోలు అనేవి విశ్వమంతా వ్యాపించి ఉండే అతి సూక్ష్మమైన కణాలు. ఇవి మనల్ని, మన భూమిని కూడా దాటుకొని నిరంతరం ప్రయాణిస్తూనే ఉంటాయి. కానీ, వీటిని గుర్తించడం చాలా కష్టం. ఎందుకంటే ఇవి దేనితోనూ సులభంగా చర్య జరపవు. అరుదుగా ఏదైనా అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు మాత్రమే వీటి ఉనికిని పసిగట్టడం సాధ్యమవుతుంది. విశ్వంలో జరిగే అతి శక్తిమంతమైన ప్రక్రియల నుంచి ఈ న్యూట్రినోలు పుడతాయి. ఇతర కణాల్లా కాకుండా, న్యూట్రినోలు తమ దిశను మార్చుకోకుండా, శక్తిని కోల్పోకుండా నేరుగా మనల్ని చేరతాయి. అందువల్ల, విశ్వంలోని రహస్యాలను ఛేదించడానికి ఇవి కీలక సమాచారాన్ని అందిస్తాయి.

హాల్జెన్ ఆలోచన.. ఐస్‌క్యూబ్ ఆవిర్భావం

అత్యంత శక్తిమంతమైన న్యూట్రినోలు చాలా అరుదుగా కనిపిస్తాయి కాబట్టి, వాటిని గుర్తించడానికి భారీ పరిమాణంలో మంచు అవసరం. ఈ క్రమంలోనే ఒక క్యూబిక్ కిలోమీటరు విస్తీర్ణంలో సెన్సార్లతో కూడిన 'ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ'ని 2011లో పూర్తిచేశారు. కొద్ది కాలంలోనే పరిశోధకులు తొలిసారిగా అధిక శక్తి కలిగిన న్యూట్రినోలను గుర్తించారు. సౌర వ్యవస్థకు ఆవల నుంచి వస్తున్న న్యూట్రినోల ఆవిష్కరణను ప్రకటించి, విశ్వంలోని న్యూట్రినో మూలాలను వెతికే అన్వేషణకు మార్గం సుగమం చేశారు. "ఫ్రాన్సిస్ హాల్జెన్ ఒక అంతర్జాతీయ బృందానికి నాయకత్వం వహించి మనకు ఒక అద్భుతమైన పరికరాన్ని అందించారు. ఆయన పట్టుదల, శాస్త్రీయ దార్శనికత ఖగోళ శాస్త్రంలో ఒక కొత్త శకానికి దారితీశాయి" అని నోబెల్ కమిటీ ఫర్ ఫిజిక్స్ ఛైర్మన్ మార్క్ పియర్స్ ప్రశంసించారు. ఐస్‌క్యూబ్ ద్వారా లభించే సమాచారం విశ్వంలోని భయంకరమైన ప్రక్రియల గురించి కొత్త విషయాలను వెల్లడించడమే కాకుండా, మునుపెన్నడూ తెలియని ఖగోళ రహస్యాలను కూడా బహిర్గతం చేయగలదని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

## 35 మంది 'ఫేక్' లెక్చరర్లు

**మొదటి పేజీ తరువాయి**

అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు. ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.

## 100 మంది 'సైబర్' ఏజెంట్లు అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించాయి. నిందితుల నుంచి మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన అనేక సైబర్ క్రైమ్ కేసులతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడిని మోసం చేసి రూ. 11 కోట్లు కాజేసిన కేసు దర్యాప్తులో ఈ అరెస్టులు కీలకంగా మారాయి. బాధితుడి నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాల్లోకే బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారందరినీ ట్రాన్సిట్ వారెంట్లపై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ మోసాల వెనుక దుబాయ్, ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్ల హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును దాచిపెట్టడానికి, తరలించడానికి సైబర్ నేరగాళ్లు ఈ మ్యూల్ ఖాతాలను ఉపయోగిస్తుంటారు. ఫిషింగ్, పెట్టుబడి మోసాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును అసలు సూత్రధారులెవరో తెలియకుండా చేసేందుకు ఈ ఖాతాలు మాధ్యమంగా పనిచేస్తాయి.




## భారత జీడీపీ వృద్ధి రేటు 7.1%

**మొదటి పేజీ తరువాయి**

వృద్ధికి ప్రైవేట్ వినియోగమే ప్రధాన చోదక శక్తిగా నిలుస్తుందని విశ్లేషించింది. వీటికి తోడు, అంచనాల కంటే మెరుగ్గా రాణిస్తున్న ఎగుమతులు కూడా ఆర్థిక వృద్ధికి మరింత ఊతమిస్తాయని వివరించింది. రంగాల వారీగా విశ్లేషిస్తే, పారిశ్రామిక రంగం ముందస్తు అంచనాలను మించి రాణిస్తోందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. తొలి త్రైమాసికంలో విద్యుత్ రంగం 9.3 శాతం, మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు 7.2 శాతం వృద్ధిని సాధించాయి. అయితే, నైరుతి రుతుపవనాల లోటు కారణంగా వ్యవసాయ రంగం పనితీరు కొంత బలహీనంగా ఉండే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది. ఆగస్టు వరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడం గ్రామీణ డిమాండ్‌పై స్వల్ప ప్రభావాన్ని చూపవచ్చని అభిప్రాయపడింది. అంతర్జాతీయ అనిశ్చితుల దృష్ట్యా ప్రైవేట్ పెట్టుబడులపై ప్రభావం పడవచ్చని, ఫలితంగా ప్రభుత్వ వ్యయం కొంత మేర తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అయినప్పటికీ, పటిష్ఠమైన ప్రభుత్వ పెట్టుబడులు, అనుకూల ఆర్థిక విధానాలు ఈ లోటును భర్తీ చేస్తాయని విశ్లేషించింది. సేవల రంగంలో సైతం వృద్ధి పటిష్ఠంగా కొనసాగుతోందని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో వెల్లడించింది.

## 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం

**మొదటి పేజీ తరువాయి**

జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల (జూన్-సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి, ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. గతంలో సుమారు 235 మండలాల్లో కరవు పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేయగా, తాజా అంచనాల్లో ప్రకారం ఆ సంఖ్య 320కి పెరిగింది.



# పత్తి దిగుబడికి 'హెచ్‌డీపీఎస్'

## అధిక సాంద్రత నాట్ల విధానంతో ప్రయోజనాలు.. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ వెల్లడి

## 'సంస్కరణల ఉత్సవం-2026'లో కీలక సంస్కరణలు.. హెచ్‌డీపీఎస్, డిజిటల్ కొనుగోళ్లు, కస్తూరి కాటన్‌పై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, అక్టోబర్ 6 (ఈవార్తలు): పత్తిలో సంప్రదాయ సాగు విధానాలతో పోలిస్తే అధిక సాంద్రత నాట్ల విధానం (హెచ్‌డీపీఎస్) వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ ఉత్పత్తుల విభాగం కమిషనర్, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ పేర్కొన్నారు. పత్తి రైతుల సాధికారత, జౌళి పరిశ్రమ బలోపేతం, పత్తి విలువ శ్రేణిలో సామర్థ్యం, పారదర్శకత, వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ చేపట్టిన సంస్కరణలను హైదరాబాద్‌లో జరిగిన 'సంస్కరణల ఉత్సవం-2026'లో ప్రదర్శించారు. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీసీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లలిత్‌కుమార్ గుప్తా, తెలంగాణ సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్, సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ, సంయుక్త కార్యదర్శి (సాంకేతిక) డాక్టర్ నరేష్‌బాబు ఎన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ ఎం.బలరాం తదితరులు పాల్గొన్నారు. పత్తి రైతులు, జౌళి పరిశ్రమ ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.సురేంద్ర మోహన్ మాట్లాడుతూ పత్తి, జౌళి రంగాల బలోపేతానికి ప్రభుత్వ సంస్థలు, వ్యవసాయ విభాగాలు, పరిశ్రమలు, రైతులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఈ విధానాన్ని విస్తృతంగా అవలంబించేలా ఉమ్మడి ప్రయత్నాలు, తగిన విధానపరమైన చర్యలు అవసరమన్నారు. డిజిటల్ మార్పులు, ఉత్పాదకత పెంపు, కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు, నాణ్యత మెరుగుదల, వ్యాపార నిర్వహణ సౌలభ్యం వంటి అంశాలపై అనుభవాలను పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.




### డిజిటల్ విధానాలకు ప్రాధాన్యం

సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణ, పారదర్శకత, సాంకేతికత, రైతు సంక్షేమానికి సంస్థ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతులతో అనుసంధానం పెంచడం, పనితీరు మెరుగుపరచడం, పత్తి విలువ శ్రేణిలో పోటీతత్వాన్ని పెంచడం కోసం చేపట్టిన సంస్కరణలను వివరించారు. కార్యక్రమంలో 'కపాస్ కిసాన్' యాప్, 'పత్తి ఉత్పాదకత మిషన్-కపాస్ క్రాంతి', పత్తిపై నాణ్యత నియంత్రణ ఉత్తర్వుల తొలగింపు, పత్తి బేళ్లు-విత్తనాల బిల్లింగ్ ప్రక్రియను డిజిటలీకరించే 'కాట్‌బిజ్' వంటి కార్యక్రమాలను లఘుచిత్రాల ద్వారా ప్రదర్శించారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు అందించడంతోపాటు డిజిటల్ అనుసంధానాన్ని సులభతరం చేస్తున్నట్లు వివరించారు. 'కపాస్ క్రాంతి' ద్వారా దేశంలో పత్తి దిగుబడి, నాణ్యత పెంపునకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### హెచ్‌డీపీఎస్‌తో దిగుబడి పెంపు

అకోలాకు చెందిన ఓ రైతు హెచ్‌డీపీఎస్ సాగు విధానంతో తన అనుభవాలను పంచుకున్నారు. తొలుత 5 వేల హెక్టార్లలో మాత్రమే ఈ విధానం అమలు కాగా ప్రస్తుతం సుమారు 30 వేల హెక్టార్లకు విస్తరించినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ఎకరాకు పత్తి దిగుబడి 12 క్వింటాళ్ల నుంచి 18 క్వింటాళ్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. కూలీల కొరతను అధిగమించడంతోపాటు యంత్రాల వినియోగం సులభమవడం, కలుపు నియంత్రణ మెరుగుపడటం, పెట్టుబడి వ్యయం తగ్గడం వంటి ప్రయోజనాలు హెచ్‌డీపీఎస్‌తో ఉన్నాయని వివరించారు.

### నాణ్యతకు 'కస్తూరి కాటన్'

తెలంగాణ సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ రాహుల్ రాజ్ పి.ఎస్ మాట్లాడుతూ కనీస మద్దతు ధర కింద పత్తి కొనుగోళ్లలో సమర్థవంతమైన ఏర్పాట్లు, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం, పారదర్శక విధానం కీలకమన్నారు. డాక్టర్ ఎం.బలరాం మాట్లాడుతూ పత్తి ఉత్పాదకత, నాణ్యత పెంపునకు శాస్త్రీయ సాగు పద్ధతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, రైతులు, పరిశ్రమల మధ్య సమన్వయం అవసరమన్నారు. 'కస్తూరి కాటన్ భారత్' కార్యక్రమం కింద పత్తి నాణ్యత, ధ్రువీకరణ, బ్రాండింగ్, ఉత్పత్తి మూలాన్ని గుర్తించే విధానాలపై టెక్స్‌ప్రోసిల్ ప్రతినిధులు వివరించారు. తెలంగాణ కాటన్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కస్తూరి కాటన్ నాణ్యత, కొనుగోలు, ప్రాసెసింగ్‌పై పరిశ్రమ అభిప్రాయాలను వెల్లడించారు. స్పిన్నింగ్ పరిశ్రమ ప్రతినిధి ధీరజ్ ఖేతాన్ కూడా కస్తూరి కాటన్ నాణ్యతపై తన అనుభవాలను పంచుకున్నారు.

### పట్టు రంగంలోనూ నూతన కార్యక్రమాలు

కేంద్ర పట్టు మండలి చేపట్టిన పలు నూతన విధానాలను కూడా కార్యక్రమంలో ప్రదర్శించారు. సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ డాక్టర్ నరేష్‌బాబు డిజిటలీకరణ, పట్టుపురుగుల పెంపకం ఆధారిత పర్యాటక ప్రణాళికలపై వివరించారు. బెంగళూరు కేంద్ర పట్టు మండలి శాస్త్రవేత్త డాక్టర్ విశాఖ 'మేరా రేషమ్ మేరా అభిమాన్' కార్యక్రమాన్ని వివరించారు. పత్తి, పట్టు రంగాలకు చెందిన రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. విలువ శ్రేణిలో డిజిటల్ విధానాలు, ఆధునిక సాంకేతికత, భాగస్వాముల మధ్య మెరుగైన అనుసంధానం ఉత్పాదకత, పారదర్శకత, పోటీతత్వాన్ని పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# ఏపీ ఇంటెలిజెన్స్ 'ఆపరేషన్ ఫైర్‌వాల్'

**పాక్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఛేదన**

**విశాఖ, కోయంబత్తూర్‌లో ఇద్దరు అరెస్టు**

**విశాఖ నేవీ స్థావరాల సమాచారమే లక్ష్యంగా కుట్ర**

**13 మంది నేవీ సిబ్బంది సహా 18 మందిపై నిఘా**

వైజాగ్, అక్టోబర్ 6 (ఈవార్తలు): భారత నావికాదళానికి చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం ఛేదించింది. "ఆపరేషన్ ఫైర్‌వాల్-2026" పేరుతో చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా విశాఖపట్నంలోని కీలక రక్షణ స్థావరాల సమాచారాన్ని శత్రు దేశానికి చేరవేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో మొత్తం 18 మంది అనుమానితులపై నిఘా పెట్టినట్లు కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. వీరిలో 13 మంది నేవీ సిబ్బంది కూడా ఉండటం సంచలనం సృష్టిస్తోంది. 12 ప్రత్యేక బృందాలు ఏకకాలంలో కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక సహా 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సోదాలు జరిపాయి. నిందితులు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ చానెళ్ల ద్వారా సంప్రదింపులు జరిపినట్లు ఆధారాలు సేకరించారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలను విశ్లేషిస్తున్నారు. అరెస్టయిన వారిలో విశాఖపట్నానికి చెందిన కాంట్రాక్టు డ్రైవర్ అన్నం సాయి వరప్రసాద్ ఒకరు. ఇతను నేవీ, ఇతర రక్షణ స్థావరాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని డబ్బు కోసం పాక్ ఏజెంట్‌కు చేరవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అతనికి అక్టోబర్ 14 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ప్రస్తుతం విశాఖ జిల్లా జైలులో ఉన్నాడు. రెండో నిందితుడు కోయంబత్తూర్‌కు చెందిన నేవీ ఉద్యోగి ప్రదీప్ ముఖర్జీ. పాకిస్థాన్ ఏజెంట్‌కు సంబంధించిన వాట్సాప్ ఖాతాను యాక్టివేట్ చేయడానికి అవసరమైన ఓటీపీని ఇతను షేర్ చేసినట్లు గుర్తించారు. ట్రాన్సిట్ వారెంట్‌పై అతన్ని విజయవాడకు తరలించారు. ఇతనికి కూడా అక్టోబర్ 14 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించగా, విజయవాడ జిల్లా జైలులో ఉంచారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. మిగిలిన అనుమానితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.

# దుర్గం చెరువు అభివృద్ధికి స్పెషల్ పర్పస్ వెహికల్

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం**

**140 ఎకరాల్లో అభివృద్ధి పనులకు ఆమోదం**

హైదరాబాద్, అక్టోబర్ 6 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ప్రఖ్యాత దుర్గం చెరువు సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఏంసీ) సిద్ధమవుతోంది. సుమారు 140 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రతిపాదనకు సోమవారం జరిగిన సీఏంసీ స్థాయీ సంఘం సమావేశంలో ఆమోదం లభించిందని అధికారులు తెలిపారు. ఈ ఎస్పీవీ ద్వారా చెరువు అభివృద్ధి ప్రాజెక్టును ప్రత్యేకంగా చేపట్టడంతోపాటు, ఈ కార్యక్రమానికి అవసరమైన నిధుల సమీకరణ కూడా సులభతరం అవుతుందని భావిస్తున్నారు. దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా అరికట్టేందుకు అధికారులు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే చెరువు చుట్టూ నాలుగు ప్రధాన మురుగునీటి మార్గాలను గుర్తించి, వాటిని అడ్డగించి శుద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. గతంలోనూ దుర్గం చెరువు చుట్టూ వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు, ఇతర ప్రజా సౌకర్యాలు కల్పించారు. తాజా నిర్ణయంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇదే సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. చింతల కుంట చెరువు పునరుద్ధరణ కోసం రూ.21.59 కోట్లు, కూకట్‌పల్లి జోన్‌లో బాక్స్ డ్రెయిన్ పనుల పూర్తికి రూ.5.95 కోట్లు, గజులరామారం సర్కిల్ ఆఫీస్ భవన నిర్మాణానికి రూ.5.18 కోట్లు కేటాయించారు. మున్సిపల్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాల కోసం తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన టీ-వర్క్స్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ)కు కూడా ఆమోదం లభించింది.

# మన్నె క్రిశాంక్ అరెస్ట్

## సీఎం రేవంత్ కుటుంబంపై ఆరోపణలు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అరెస్ట్: కేటీఆర్




హైదరాబాద్, అక్టోబర్ 6 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'వీ= మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి. అరెస్టుకు ముందు క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.

# రష్యా సైన్యంలో తెలంగాణ యువకులు

**ఉద్యోగాల పేరుతో వల, అప్పులు చేసి మరీ వెళ్లి యుద్ధంలోకి**

**20 మంది రిక్రూట్‌మెంట్ అయినట్లు సమాచారం**

నిజామాబాద్, అక్టోబర్ 6 (ఈవార్తలు): తెలంగాణ యువకులను విదేశీ ఉద్యోగాల పేరుతో రష్యాకు తీసుకెళ్లి.. అక్కడి సైన్యంలో చేర్చారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వంటవాళ్లు, క్లీనర్లు, మెకానిక్‌లు, గార్డెనర్లు, ఇతర సహాయక సిబ్బంది ఉద్యోగాలు విదేశాల్లో ఇప్పిస్తామని నమ్మించి కొందరు ఏజెంట్లు.. యువకులను రష్యాకు పంపినట్లు బాధిత కుటుంబాలు ఫిర్యాదు చేశాయి. అక్కడికి వెళ్లిన తర్వాత కొందరికి పౌర ఉద్యోగాలు ఇవ్వకుండా సైనిక శిక్షణకు పంపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. తెలంగాణకు చెందిన 20 మంది ఈ రిక్రూట్‌మెంట్ నెట్‌వర్క్ బారిన పడి.. అక్కడికి వెళ్లినట్లు సమాచారం. వీరిలో కొందరు స్వదేశానికి తిరిగి రాగా.. మరికొందరు ఇంకా అక్కడే చిక్కుకుపోయారని బాధితులు చెబుతున్నారు. నలుగురు తెలంగాణ యువకులు రష్యా సైన్యం తరఫున ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొన్నట్లు భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన మెగావత్ ప్రకాశ్ ఉదంతం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రష్యాలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో రామడుగుకు చెందిన మాధవరావుకు.. వీసా, ప్రయాణ ఖర్చుల కోసం ప్రకాశ్ రూ.2.4 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. రష్యాకు వెళ్లిన ప్రకాశ్ అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో సుమారు 4 నెలలపాటు పనిచేసినట్లు సమాచారం. అయితే ఆ కంపెనీ మూతపడటంతో అతని పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మరో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన మాధవరావు.. రష్యాలో ఉన్న ఏజెంట్లు ఒడ్డె యల్లయ్య, తేలు కృష్ణ ద్వారా ఏర్పాట్లు చేస్తానని మరో రూ.50 వేలు అడిగినట్లు అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత ప్రకాశ్‌ను గౌరవ్ చౌదరి వద్దకు తీసుకెళ్లారని.. ఆయన ద్వారా రష్యా సైన్యంలో నియామకానికి సంబంధించిన ప్రక్రియ జరిగిందని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఉద్యోగం కోసం వెళ్లిన యువకుడు సైనిక నియామక వ్యవహారంలోకి ఎలా వెళ్లాడన్నది ఇప్పుడు కీలకంగా మారింది. రష్యాకు చేరుకున్న తర్వాత తమకు హామీ ఇచ్చిన పౌర ఉద్యోగాలు కాకుండా సైనిక శిక్షణ ఇచ్చినట్లు కొందరు బాధితులు, వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు. సుదీర్ఘ సమయం శారీరక శిక్షణ ఇవ్వడం, తగినంత ఆహారం అందకపోవడం, నిద్రకు సరిపడా సమయం లేకపోవడం, నాసిరకం వసతుల్లో ఉండాల్సి రావడం వంటి ఇబ్బందులు ఎదురయ్యాయని ఎలాగోలా అక్కడి నుంచి తిరిగి భారత్‌కు వచ్చినవారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు లేఖ రాశారు. రష్యాలో చిక్కుకున్న 16 మంది భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరి విడుదల, తిరుగు ప్రయాణానికి సహకరించిన కేంద్ర విదేశాంగ శాఖకు.. భారత రాయబార కార్యాలయానికి ఎంపీ అర్వింద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో నిజామాబాద్ పోలీసులు గౌరవ్ చౌదరి (34)ని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కర్వార్‌కు చెందిన అతడి బ్యాంకు అకౌంట్లను రష్యా సైనిక నియామక సంస్థ ఉపయోగించుకుందని అతడు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

# సూర్యాపేటలో తొలి గ్రీన్‌ఫీల్డ్ కమ్యూనిటీ కిచెన్

**నిత్యం 60 వేలమందికి అల్పాహారం**

**భట్టి, ఉత్తమ్ చేతుల మీదుగా శంకుస్థాపన**

సూర్యాపేట, అక్టోబర్ 6 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఎస్ఎం పేట సమీపంలో అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.9.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 1029 స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లోని దాదాపు 60 వేల మంది విద్యార్థులకు రోజూ అల్పాహారం అందించనున్నారు. మునగాల మండలంలో నేషనల్ హైవేకి సమీపంలో ఎంపిక చేసిన స్థలంలో ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారాన్ని తయారు చేసి.. ప్యాకింగ్ చేసి, నిర్ణీత సమయానికి స్కూళ్లకు రవాణా చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. ఆధునిక వంట పరికరాలు, పరిశుభ్రమైన ఆహార తయారీ సదుపాయాలతో ఈ గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందుబాటులోకి రానుంది. పాఠశాలకు వచ్చే పిల్లలకు ఉదయం పూట పౌష్టికాహారం అందడం వల్ల వారి ఆరోగ్యం, చదువుపై ఏకాగ్రత మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి సంస్థ రూ.9.60 కోట్ల నిధులను సమకూర్చినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తనతో పాటు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ ప్రాజెక్టుకు నిధులు అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు సమకూర్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామని సింగరేణి సంస్థ పేర్కొన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సంస్థకు మంత్రి, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు గుర్తు చేశారు. మునగాల కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం పూర్తయి, సేవలు ప్రారంభమైతే సూర్యాపేట జిల్లాలో వేలాది మంది విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి అల్పాహారం అందించే వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు అమలు తీరు, ఆహార సరఫరా సామర్థ్యం, విద్యార్థులకు అందే ప్రయోజనాలు తదుపరి కీలక అంశాలుగా మారనున్నాయి.

# అమరావతిలో జాప్యం వద్దు

**రాజధాని పనులపై చంద్రబాబు ఆదేశాలు**

అమరావతి, అక్టోబర్ 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.



# ఆన్‌లైన్ ఆఫర్లు.. లోన్లతో జాగ్రత్త!

## ఆలోచించి ముందడుగు వేయాలి.. సైబర్ నేరాలపై జగిత్యాల పోలీసుల అవగాహన




**(ఈవార్తలు - ప్రత్యేక కథనం)**

సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఆన్‌లైన్ లోన్లు, లాటరీలు, నకిలీ ఆఫర్ల పేరిట జరుగుతున్న ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు జగిత్యాల జిల్లా పోలీసులు నడుం బిగించారు. సైబర్ మోసగాళ్ల ట్రాప్‌లో పడకుండా ప్రజలను చైతన్యపరచడంలో జగిత్యాల పోలీసులు పోషిస్తున్న పాత్ర ఎంతో అభినందనీయం. 'మంచి ఆఫర్లు, సులభమైన లోన్లు' అంటూ వచ్చే ఆశావహ ప్రకటనల వెనుక ఉండే ప్రమాదాలను ఈ పోస్టర్ల ద్వారా ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నారు. ఎలాంటి ఆన్‌లైన్ లావాదేవీలు లేదా ఆఫర్లను నమ్మే ముందు "ఆగండి.. ఆలోచించండి.. సరిచూసుకోండి" అనే సూత్రాన్ని పాటించాలని సూచిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, లింకుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, ఆలస్యం చేయకుండా వెంటనే 1930 అనే హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా ప్రత్యేక అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో స్పందిస్తే కోల్పోయిన సొమ్మును తిరిగి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి**

సైబర్ నేరాలపై అందే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి నిందితులను గుర్తించాలని సూచించారు. దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ఆధారాలను సమర్థంగా వినియోగించాలని, ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ.. అనుమానాస్పద కాల్స్, లింకులు, ఆన్‌లైన్ ఆఫర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐలు రామ్ నరసింహారెడ్డి, సుధాకర్, కరుణాకర్, సురేష్ బాబు, లక్ష్మీ నారాయణ, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, సైబర్ క్రైమ్ ఎస్సైలు కృష్ణ, దినేశ్, సైబర్ క్రైమ్ సిబ్బంది మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భిక్షాటన వద్దు.. చదివిస్తా!

## పుస్తకాలు పట్టాల్సిన చేతుల్లో భిక్షాపాత్రలు వద్దు.. చిన్నారులకు ఆప్యాయ పలకరింపు

**జగిత్యాల సీఐ కరుణాకర్ మానవీయత**

**నమ్మకంతో బడి బాట పట్టిన చిన్నారులు**

**(ఈవార్తలు - ప్రత్యేక కథనం)**

చేతుల్లో పుస్తకాలు.. భుజాన పాఠశాల సంచి.. స్నేహితులతో కలిసి బడిబాట పట్టాల్సిన వయసు. కానీ ఆ చిన్నారుల చేతుల్లో కనిపించింది భిక్షాపాత్రలు. చదువుకోవాల్సిన నాలుగైదేళ్ల వయసులోనే ఎండలో నిలబడి బతుకుదెరువు కోసం భిక్షాటన చేయాల్సిన పరిస్థితి. జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద కనిపించిన ఈ దృశ్యం అక్కడి వారిని కలచివేసింది. విధులకు వెళుతున్న జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ దృష్టి కూడా ఆ చిన్నారులపై పడింది. తల్లిదండ్రులతో కలిసి రోడ్డుపై భిక్షాటన చేస్తున్న ఇద్దరు చిన్నారులను చూసిన ఆయన వెంటనే తన వాహనాన్ని ఆపారు. సాధారణంగా చూసి వెళ్లిపోకుండా వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులతో కొద్దిసేపు మాట్లాడిన సీఐ.. వారి పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. "చదువుకుంటారా.. మిమ్మల్ని చదివిస్తా" అంటూ ఆప్యాయంగా చెప్పడంతో చిన్నారుల్లోనూ నమ్మకం కనిపించింది. పోలీసు అధికారి వెంట వస్తామని వారు చెప్పడంతో వారిని ఆటోలో ఎక్కించి సురక్షితంగా అక్కడి నుంచి తరలించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించారు. చిన్నారుల భద్రత, విద్య, సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు.






**భిక్షాపాత్రల నుంచి.. పుస్తకాల వైపు**

ఆ చిన్నారులు భిక్షాటన చేస్తున్న దృశ్యం ఒక క్షణం మాత్రమే కావచ్చు. కానీ వారి బాల్యం మాత్రం ఆ ఒక్క క్షణంలోనే మన ముందుకు ప్రశ్నగా నిలిచింది. బడికి వెళ్లాల్సిన వయసులో రోడ్డుపై నిలబడాల్సి రావడం వెనుక ఉన్న పరిస్థితులు ఏమిటి? బాలల హక్కులు, విద్య, భద్రత వారికి ఎంతవరకు అందుతున్నాయి? అన్న ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి ముందుకు వచ్చాయి. ఒక పోలీసు అధికారి విధుల్లో భాగంగా అక్కడి నుంచి వెళ్లిపోవచ్చు. కానీ సీఐ కరుణాకర్ ఆ చిన్నారులను చూసి ఆగారు. వారి పరిస్థితిని గమనించారు. పలకరించారు. భరోసా ఇచ్చారు. అవసరమైన అధికారులకు సమాచారం అందించారు. ఒక చిన్నారి జీవితంలో మార్పుకు కొన్నిసార్లు పెద్ద వ్యవస్థల కంటే ముందుగా ఒక మనిషి చూపించే మానవత్వమే తొలి అడుగవుతుంది. నేరాలను అరికట్టడం మాత్రమే పోలీసుల బాధ్యత కాదని, సమాజంలో రక్షణ అవసరమైన చిన్నారులను గుర్తించి వారికి అండగా నిలవడం కూడా సామాజిక బాధ్యతలో భాగమేనని ఈ ఘటన గుర్తుచేసింది. రోడ్డుపై భిక్షాటన చేస్తున్న ఆ చిన్నారుల చేతుల్లో ఇక భిక్షాపాత్రలు కాకుండా పుస్తకాలు కనిపించాలి. ఎండలో నిలబడే ఆ చిన్న పాదాలు బడిబాట పట్టాలి. వారి బాల్యం రోడ్డుపైనే ఆగిపోకుండా.. తరగతి గదిలోకి అడుగుపెట్టాలి. సీఐ కరుణాకర్ చూపిన ఈ మానవీయ స్పందన ఆ దిశగా ఒక ఆశాజనకమైన అడుగుగా నిలిచింది.



# వేములవాడ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్

**211 ఓట్ల భారీ మెజార్టీతో విజయం**

వేములవాడ అర్బన్, అక్టోబర్ 6 (ఈవార్తలు): వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ తన సమీప ప్రత్యర్థిపై 211 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. డివిజన్ పరిధిలో మొత్తం 1,281 ఓట్లు పోలయ్యాయి. విజయం అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రతి ఆటో కార్మికుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఓటు వేసిన వారితోపాటు ఓటు వేయని వారిని కూడా సమానంగా చూసుకుంటూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల సమయంలో వివిధ రకాల హామీలు, ప్రలోభాలు ఉన్నప్పటికీ కార్మికులు వాటికి ప్రభావితం కాకుండా తనకు మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల్లో నగదు ప్రలోభాలు, రాజకీయ జోక్యాలు చోటుచేసుకున్నాయని, ఈసారి కార్మికులు నిజాయితీకి పట్టం కట్టారని అన్నారు. ఆటో యూనియన్ రాజకీయాలకు అతీతంగా కేవలం కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా వారి తరఫున ముందుండి పోరాడతానన్నారు. రాబోయే రెండేళ్ల పాటు ఆటో కార్మికులందరికీ నమ్మకమైన సేవకుడిగా పనిచేస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ం



# విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**68 మంది విద్యార్థులకు ఉచితంగా అందజేత**

వేములవాడ అర్బన్, అక్టోబర్ 6 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల హరిజనవాడకు చెందిన 68 మంది విద్యార్థులకు మందిరం రఘు-సుచరిత దంపతులు ఉచితంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అనిత, రాంప్రభు, శ్రీనాథ్ విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతోపాటు వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు సొంత ఖర్చులతో దుస్తులు అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా సహాయం అందించిన మందిరం రఘు-సుచరిత దంపతులకు పాఠశాల ఉపాధ్యాయులు, కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రూ అప్ భారం ప్రభుత్వమే భరించాలి

**రూ.7,635 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపొద్దు**

**సీఎం రేవంత్‌రెడ్డికి జీవన్‌రెడ్డి లేఖ**




జగిత్యాల, అక్టోబర్ 6 (ఈవార్తలు): ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపకుండా, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.7,635.22 కోట్ల ట్రూ అప్ ఛార్జీల వసూలుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) అనుమతించిందని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను ప్రభుత్వం భరించనుండగా, మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారని పేర్కొన్నారు.

# రాజన్న గుడిని కృష్ణశిలతోనే కట్టాలి

## ఆగమ సంప్రదాయాలు పాటించాలి .. కాంక్రీట్‌తో అశాస్త్రీయ పద్ధతులు వద్దు .. టీఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్.. భీమన్నను దర్శించుకుని మొక్కులు




రాజన్న సిరిసిల్ల/వేములవాడ అర్బన్, అక్టోబర్ 6 (ఈవార్తలు):దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని కాంక్రీట్‌తో కాకుండా కృష్ణశిల రాళ్లతో శాస్త్రీయ, సాంప్రదాయ పద్ధతుల్లో అభివృద్ధి చేయాలని రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణంలో శిల్పశాస్త్ర, ఆగమ సంప్రదాయాలను పాటించాలని కోరారు. వేములవాడ భీమన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆలయ అధికారులు వేదోక్త ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో రోడ్ల వెడల్పు వల్ల భారీగా దుమ్ము లేస్తోందని, అదే ప్రాంతంలో కూరగాయల విక్రయాలు జరుగుతున్నందున వ్యాపారులు, ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు.వేములవాడ చెరువు నుంచి దుర్గంధం వస్తోందని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తీసుకుని చెరువును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద టెంపుల్ ఏరియాగా ఉన్న వేములవాడకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**సాగునీటిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి**

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఆశించిన స్థాయిలో సాగునీరు అందడం లేదని విమర్శించారు. దుంపేట వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే రెండు మండలాలకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, ఆది శ్రీనివాస్ తన పరపతిని ఉపయోగించి ఈ ప్రాజెక్టును సాధించాలని కోరారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తే పంటలకు ఇబ్బందులు ఉండవన్నారు.సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తేనే అభివృద్ధి చేస్తామనడం సరికాదు. ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను సమానంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.

**గల్ఫ్ కార్మికులకు రూ.5 లక్షల సాయం అందించాలి**

జిల్లాకు చెందిన 112 మంది గల్ఫ్ కార్మికులకు రావాల్సిన రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. సిరిసిల్ల-వేములవాడ ప్రాంతంలో జేఎన్‌టీయూ ల్యాబ్ అందుబాటులో లేక విద్యార్థులు జగిత్యాలకు వెళ్లాల్సి వస్తోందని, స్థానికంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. మెడికల్ కాలేజీలోనూ పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ ఆలయాల అభివృద్ధి గురించి మాట్లాడుతున్నప్పటికీ, రాజన్న ఆలయ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలని అన్నారు.

**నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి**

నేరెళ్ల బాధితులను ప్రభుత్వం సమానంగా ఆదుకోలేదని, కొందరికి 5 లక్షలు, మరికొందరికి 10 లక్షలు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికీ కొంతమంది బాధితులు నడవలేని పరిస్థితిలో ఉన్నారని, వారికి ప్రభుత్వం కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు రక్షణ సేన పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ప్రకటించారు.

సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయడం వల్ల ఈ ప్రాంతంలో విద్యుత్ సేవలుదెబ్బతిన్నాయని, ప్రజలు విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

**జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం**

వేములవాడ-సిరిసిల్ల ప్రాంతం ప్రజా ఉద్యమాల జిల్లాగా పేర్కొంటూ, జర్నలిస్టులకు ఇళ్లు, అక్రిడిటేషన్ కార్డులు తదితర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.లొంగిపోయిన మాజీ నక్సలైట్ల కోసం పార్టీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని, మాజీ నక్సలైట్లు రక్షణ సేనలో చేరి ప్రజా సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాంచజన్యం ఎజెండాతో రక్షణ సేన పార్టీని ఏర్పాటు చేశామని, తమిళనాడు తరహాలో తెలంగాణలో సమగ్ర విద్యా చట్టం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ భూములను తీసుకుని నిర్మించిన పెద్ద ఆసుపత్రుల్లో పేదలకు తక్కువ ఫీజులతో వైద్యం అందించేలా నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు.

**వేములవాడలో పోటీపై నిర్ణయం తీసుకోలేదు**

రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తరఫున తాను వేములవాడ నియోజకవర్గం నుంచే బరిలోకి దిగుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై ఆ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత స్పష్టతనిచ్చారు. వేములవాడ నుంచి పోటీ చేసే అంశంపై తాను కానీ, తమ పార్టీ కానీ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కవిత స్పష్టం చేశారు. అయితే, వచ్చే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలోనూ ప్రధాన రాజకీయ పార్టీలకు తమ తెలంగాణ రక్షణ సేన గట్టి పోటీ ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రధాన పార్టీలు తీవ్రంగా విఫలమయ్యాయని, అందుకే తాము ప్రజాక్షేత్రంలో నిలబడి పోరాడుతున్నామని చెప్పారు. నాయకులు ప్రజల కోసం పని చేయకపోతే సొంత స్థానాలను కాపాడుకోవడం కూడా కష్టమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రక్షణ సేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పరిశీలన

**గర్షకుర్తి, తాడిజెర్రిలో కేంద్రాలను సందర్శించిన బీజేపీ నేతలు**

**మాజీ ఎమ్మెల్యే శోభక్క ఆధ్వర్యంలో సేవల పరిశీలన**

గంగాధర, అక్టోబర్ 6 (ఈవార్తలు): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాల సందర్భంగా గంగాధర మండల బీజేపీ ఆధ్వర్యంలో గర్షకుర్తి, తాడిజెర్రి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టికాహార పంపిణీ, సేవలను పరిశీలించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే శోభక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలపై అంగన్వాడీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, కేంద్రాల పనితీరును పరిశీలించారు. చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులతో మాట్లాడి పౌష్టికాహారం అందుతున్న తీరుపై ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యకర ఎదుగుదలకు పౌష్టికాహారం కీలకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. సేవలను సమర్థంగా అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సన్మానించి అభినందించారు.

# హత్యాయత్నం కేసులో ఏ-1 అరెస్ట్

**రెండేళ్లుగా పరారీలో ఉన్న వినయ్‌సింగ్ పట్టివేత**

**14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్**

కోరుట్ల, అక్టోబర్ 6 (ఈవార్తలు): కోరుట్ల గాంధీరోడ్‌లో 2024లో జరిగిన హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కేసులో ప్రధాన నిందితుడు ఠాకూర్ వినయ్‌సింగ్ (31)ను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున కోరుట్ల బస్‌స్టాండ్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. 2024 జూన్ 24న పాత కక్షల నేపథ్యంలో పొగుల రాజేష్‌పై నిందితులు దాడి చేసి హత్యకు యత్నించారు.

# ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

**ఏజెంట్ల ద్వారా అదనపు వసూళ్లపై ఆరా**

**ఎంవీఐ గైర్హాజరీలో పరీక్షల నిర్వహణపై పరిశీలన**



కోరుట్ల, అక్టోబర్ 6 (ఈవార్తలు): కోరుట్ల రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారి గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయ పరిపాలన, రికార్డులు, దరఖాస్తుల పరిష్కారం, ఆర్థిక లావాదేవీలను పరిశీలించారు. తనిఖీల్లో ఎంవీఐ గైర్హాజరీలో డ్రైవింగ్ పరీక్షలు, వాహనాల నమోదు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ సేవల కోసం వచ్చే ప్రజల నుంచి ఏజెంట్ల ద్వారా అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఏజెంట్లు కార్యాలయంలో స్వేచ్ఛగా ప్రవేశించడంతోపాటు సిబ్బందితో నేరుగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదని, కింది స్థాయి సిబ్బందిపై తగిన పర్యవేక్షణ లేదని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. డ్రైవింగ్ ట్రాక్ రవాణాశాఖ ప్రమాణాలకు అనుగుణంగా లేదని, వాహనదారులకు మార్గదర్శకాలు అందించే సూచిక బోర్డులు కూడా లేవని తెలిపారు. గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు వెల్లడించారు. లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఏసీబీ వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# ఇండియా కూటమి పక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం

**కేంద్ర విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మంత్రి అడ్లూరి**




జగిత్యాల, అక్టోబర్ 6 (ఈవార్తలు): ఏఐసీసీ పిలుపు మేరకు జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో ఇండియా కూటమి మిత్రపక్షాల సంయుక్త ఆధ్వర్యంలో 'ఓటు బచావో.. దేశ్ బచావో' కార్యక్రమంపై మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు చోరీ ఎలా జరుగుతుందనే అంశాలను ప్రజలకు వివరించాలని, ఇండియా కూటమి పక్షాలు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మిత్రపక్షాలు కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణిశ్రీనివాస్, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, సీపీఎం కార్యదర్శి సులోచన చౌదరి, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి అక్రమ్, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, సేవాదళ్ కార్యదర్శి ముకేష్‌ఖన్నా, ఎన్ఆర్ఐ సెల్ చాంద్‌పాషా, టౌన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుమాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 'ఆటో'సేల్స్ అదుర్స్

## రికార్డు స్థాయిలో 25.36 లక్షల వాహన విక్రయాలు

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం సెప్టెంబర్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పండుగ సీజన్ ప్రారంభం కావడంతో వినియోగదారుల నుంచి బలమైన డిమాండ్ కనిపించింది. ఫలితంగా, దేశీయ ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో 25,36,920 యూనిట్లకు చేరాయి. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఇది 31.82 శాతం అధికం. ఈ వివరాలను 'ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్' (ఎఫ్ఏడీఏ) తాజాగా విడుదల చేసిన గణాంకాలలో వెల్లడించింది. ఆగస్టు నెలతో పోల్చినా అమ్మకాలు 4.69 శాతం పెరిగాయి. భారత ఆటో పరిశ్రమ చరిత్రలో ఒకే నెలలో, ముఖ్యంగా సెప్టెంబర్‌లో ఈ స్థాయిలో అమ్మకాలు నమోదు కావడం ఇదే తొలిసారి. అయితే, ఈ 31.82 శాతం వార్షిక వృద్ధిని కొంత జాగ్రత్తగా చూడాలని ఫాడా హెచ్చరించింది. గతేడాది సెప్టెంబర్ 2025లో జీఎస్టీ 2.0 అమలు కానుందన్న ఊహాగానాలతో చాలామంది వాహనాల కొనుగోలును వాయిదా వేశారు. దీనివల్ల అప్పుడు అమ్మకాలు తక్కువగా నమోదయ్యాయి. ఈ 'లో-బేస్ ఎఫెక్ట్' కారణంగానే ఈ ఏడాది వృద్ధి శాతం భారీగా కనిపిస్తోందని ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ వివరించారు. వాస్తవానికి, 2027 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో (ఏప్రిల్-సెప్టెంబర్) మొత్తం అమ్మకాలు 1,55,12,319 యూనిట్లకు చేరడం ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. ఇది గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 20.77 శాతం వృద్ధి.




# ఇంచు దాటొచ్చినా చుక్కలు చూపిస్తాం

## దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా హెచ్చరిక

ప్యాంగ్యాంగ్: ఇరు కొరియాల మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. తమ భూభాగంలోకి ఒక్క మిల్లీమీటర్ అడుగుపెట్టినా తక్షణమే, అత్యంత శక్తిమంతంగా ప్రతిఘటిస్తామని ఉత్తర కొరియా మంగళవారం దక్షిణ కొరియాను తీవ్రంగా హెచ్చరించింది. సరిహద్దులో ఇటీవల జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడు ఘటనపై దక్షిణ కొరియా తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెప్టెంబర్ 21న ఇరు దేశాల సరిహద్దులోని సైనిక రహిత ప్రాంతం దక్షిణ భాగంలో జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఇద్దరు దక్షిణ కొరియా సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఉత్తర కొరియానే కారణమని, వారు ఉద్దేశపూర్వకంగానే మైన్‌లను అమర్చారని దక్షిణ కొరియా సైన్యం దర్యాప్తులో పేర్కొంది. దీనికి ప్రతిస్పందనగా, ఐక్యరాజ్యసమితి కమాండ్ సహకారంతో దక్షిణ కొరియా ఆ ప్రాంతంలో మైన్‌లను తొలగించే ఆపరేషన్‌ను చేపట్టింది. దీన్ని ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా దక్షిణ కొరియా రక్షణ మంత్రి కాంగ్ షిన్-చుల్ అభివర్ణించారు. ఈ పరిణామాలపై ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ల్యాండ్‌మైన్ పేలుడుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ మేరకు ఆరోపణలను పూర్తిగా ఖండించింది. దక్షిణ కొరియా ఉద్దేశపూర్వకంగా కట్టుకథ అల్లి, తమపై నిందలు వేస్తోందని, అంతర్జాతీయంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. "ఒకవేళ దక్షిణ కొరియా సైనికులు సరిహద్దు రేఖను దాటి మా భూభాగంలోకి ప్రవేశిస్తే, మా సరిహద్దు దళాలు తక్షణమే శక్తిమంతమైన ప్రతిచర్య తీసుకుంటాయి" అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.



# రూ.1.51 లక్షలకే కాంబోడియా టూర్

## చెన్నై నుంచి ఐఆర్‌సీటీసీ కొత్త ప్లాన్

### నవంబర్ 17 నుంచి 8 రోజుల పాటు యాత్ర

చెన్నై: ప్రముఖ పర్యాటక సంస్థ, భారతీయ రైల్వేకు చెందిన ఐఆర్‌సీటీసీ విదేశీ పర్యటనలను ఇష్టపడే వారి కోసం ఒక అద్భుతమైన ప్యాకేజీని ప్రకటించింది. ఆగ్నేయాసియా దేశాలైన వియత్నాం, కంబోడియాలలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ఈ టూర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 8 రోజులు, 7 రాత్రుల ఈ యాత్ర ఈ ఏడాది నవంబర్ 17న చెన్నై నుంచి ప్రారంభమై నవంబర్ 25న ముగుస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ప్రయాణికులు వియత్నాంలోని డా నాంగ్, హనోయ్, హా లాంగ్ బే వంటి సుందరమైన ప్రదేశాలను సందర్శిస్తారు. అనంతరం కంబోడియాలోని సియమ్ రీప్ నగరంతో పాటు ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆంగ్‌కోర్ వాట్ ఆలయ సముదాయాన్ని చూస్తారు. వీటితో పాటు బయోన్ ఆలయం, టా ప్రోమ్, స్థానిక మార్కెట్లు, సాంప్రదాయ అప్సర నృత్య ప్రదర్శన, టోన్లే సాప్ సరస్సులోని తేలియాడే గ్రామాలు వంటివి ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఐఆర్‌సీటీసీ ఈ ప్యాకేజీ ధరలను 'కంఫర్ట్' కేటగిరీలో ప్రకటించింది. 2% టీసీఎస్ సహా ఈ ధరలు వర్తిస్తాయి. ఈ ప్యాకేజీలో అంతర్జాతీయ, అంతర్గత విమాన టికెట్లు, బస, భోజనం, ఏసీ వాహనాల్లో ప్రయాణం, గైడ్ సేవలు, ప్రయాణ బీమా వంటివి కలిసి ఉంటాయి. యాత్రికులు చెన్నై నుంచి సింగపూర్ మీదుగా వియత్నాంలోని డా నాంగ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హనోయ్, సియమ్ రీప్‌లకు అంతర్గత విమానాల్లో ప్రయాణిస్తారు.

# రాహుల్.. హై'డ్రామా'



## ఈసీ కార్యాలయం వద్ద ఇండియా నిరసన యత్నం

## రాహుల్ సహా పలువురు ఎంపీలను అడ్డుకున్న పోలీసులు

### భేటీకి మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు: ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి నేతలు చేపట్టిన నిరసన ప్రదర్శనను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయితే, తమతో సమావేశం కోసం ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా ముందస్తు అభ్యర్థన రాలేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పార్లమెంట్ స్ట్రీట్ నుంచి ఈసీ కార్యాలయం వైపు 'ఇండియా' కూటమి నేతలు నిరసన ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలు పాల్గొన్నారు. వారిని ఆకాశవాణి భవన్, నీతి ఆయోగ్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ పోలీసు బారికేడ్లను దాటుకుని ఆల్ ఇండియా రేడియో ప్రాంగణంలోకి వెళ్లి, అక్కడే సుమారు కొన్ని గంటల పాటు గడిపారు. ఈ పరిణామాలపై ఎన్నికల సంఘం అధికారులు స్పందించారు. మంగళవారం తమతో భేటీ కోసం ఏ రాజకీయ పార్టీ కూడా ముందుగా అపాయింట్‌మెంట్ కోరలేదని వారు తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని బృందం వినతిపత్రం సమర్పించేందుకు వస్తున్నట్లు సాయంత్రం నాలుగు గంటల సమయంలో సమాచారం అందిందని, అయితే నిబంధనల ప్రకారం అధికారికంగా ఎలాంటి ముందస్తు అభ్యర్థన అందలేదని ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయని, ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఈ నిరసన చేపట్టాయి. ర్యాలీని అడ్డుకున్న పోలీసులు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నారు.

# సౌదీపై కొనసాగుతున్న హౌతీ దాడులు

**కీలక స్థావరాలపై దాడులు చేశామన్న హౌతీలు**

రియాద్: గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాపై హౌతీ ఉగ్రవాదుల దాడులు కొనసాగుతున్నాయి. సౌదీలోని కీలక స్థావరాలపై సోమవారం దాడి చేశామని హౌతీలు ప్రకటించారు. ఈ అంశంపై హౌతీ మిలిటరీ ప్రతినిధి యహ్యా సరీ మంగళవారం వివరాలు వెల్లడించాడు. సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో ఉన్న కింగ్ ఖలీద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌పై, రబిగ్‌లో ఉన్న అరాంకో రిఫైనరీపై దాడి చేసినట్లు చెప్పారు. డ్రోన్లు, బాలిస్టిక్ మిస్సైల్స్, క్రూయిజ్ మిస్సైల్స్‌తో దాడి చేసినట్లు వెల్లడించాడు. అలాగే, దక్షిణ సౌదీ అరేబియాలోని కొన్ని చిన్న ఎయిర్‌పోర్టులపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. హౌతీలు.. యెమెన్‌లోని ప్రత్యేక మిలిటెంట్ గ్రూప్. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తుంటారు. యెమెన్ సైన్యానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు సైన్యం. దీనికి నిధులు, ఆయుధాల్ని ఇరాన్ సమకూరుస్తుంటుంది. ఇరాన్ మద్దతుతో హౌతీలు సౌదీ అరేబియాపై దాడి చేస్తున్నారు. రియాద్ సహా అనేక ప్రాంతాల్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. అయితే, ఎక్కడ దాడి జరిగింది.. ఆస్తి నష్టం, ప్రాణం నష్టం, గాయపడిన వారి వివరాల్ని సౌదీ ప్రభుత్వం వెల్లడించలేదు. ఒకపక్క హౌతీలు సౌదీపై దాడి చేస్తుంటే.. సౌదీ కూడా యెమెన్‌లోని హౌతీల స్థావరాలపై దాడులు చేస్తోంది. సౌదీ కూటమి దళాలకు చెందిన యుద్ధ నౌకలు హౌతీలపై దాడులు చేసినట్లు ఈ కూటమి ప్రతినిధి తుర్కి అల్ మల్కి తెలిపారు. యెమెన్, ఎర్ర సముద్ర తీరంలోని హోదెదా పట్టణంపై దాడి చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతం హౌతీల ఆధీనంలో ఉంటుంది. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే.. యెమెన్ ప్రభుత్వానికి సౌదీ ప్రభుత్వం అండగా ఉంటే.. హౌతీ ఉగ్రవాదులకు మాత్రం ఇరాన్ అండగా ఉంటోంది. హౌతీల ఆధ్వర్యంలో ఉన్న సనా పట్టణంపైకి వెయ్యికిపైగా దాడులు చేశామని యెమెన్ ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు సౌదీ అరేబియాకు మద్దతు ఇచ్చేందుకు పాకిస్తాన్, టర్కీ అంగీకరించాయి. సౌదీకి తమ దేశాల నుంచి కొంతమంది సైన్యాన్ని పంపుతున్నట్లు తెలిపాయి.



# మళ్లీ ట్రిలియనీర్‌గా మస్క్



న్యూయార్క్: ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మరోసారి ట్రిలియనీర్ల జాబితాలో చేరారు. మూడు నెలల విరామం తర్వాత ఆయన సంపద మళ్లీ 1 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటింది. స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల షేర్ల విలువ గణనీయంగా పెరగడంతో సోమవారం ఒక్కరోజే ఆయన సంపద 65 బిలియన్ డాలర్లు పెరిగింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, మస్క్ ప్రస్తుత ఆస్తి విలువ 1.04 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఈ నెల ఆరంభం నుంచి స్పేస్‌ఎక్స్ షేర్లు 13 శాతం, టెస్లా షేర్లు 6.7 శాతం మేర లాభపడ్డాయి. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో మస్క్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. రెండో స్థానంలో ఉన్న జెఫ్ బెజోస్ (సుమారు 371.5 బిలియన్ డాలర్లు) సంపద కంటే మస్క్ ఆస్తి దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ పెరుగుదల వెనుక స్పష్టమైన కారణాలున్నాయి. స్పేస్‌ఎక్స్ కంపెనీలో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ నివేదిక ఇవ్వడం సానుకూల ప్రభావం చూపింది. దీనికి తోడు, ఇటీవల స్పేస్‌ఎక్స్ నిర్వహించిన 'స్టార్‌షిప్' ఫ్లైట్ టెస్ట్ విజయవంతం కావడం కూడా షేర్ల విలువ పెరిగేందుకు దోహదపడింది. మరోవైపు, టెస్లా కంపెనీ మూడో త్రైమాసికంలో అంచనాలకు మించి వాహనాలను డెలివరీ చేయడంతో శుక్రవారం నాడే మస్క్ సంపదకు 61 బిలియన్ డాలర్లు జతయ్యాయి. 55 ఏళ్ల మస్క్ ఈ ఏడాది జూన్‌లో తొలిసారి ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటి, ఆ ఘనత సాధించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ఆ సమయంలో ఆయన సంపద 1.45 ట్రిలియన్ డాలర్లకు చేరింది. అయితే, ఆ తర్వాత షేర్ల విలువ పడిపోవడంతో జులై చివరి నాటికి ఆయన సంపదలో 600 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ కోత పడింది. ఇప్పుడు మళ్లీ పుంజుకుని ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన ఏకైక వ్యక్తిగా నిలిచారు. అయితే, ఈ సంపదంతా నగదు రూపంలో కాదని, స్టాక్ మార్కెట్‌లోని షేర్ల విలువ ఆధారంగా వేసే అంచనా అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు.





నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో మిరాజ్-2000, మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు. ఆయన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్‌గా కూడా సేవలందించారు. వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్ వంటి పలు కీలక సైనిక చర్యల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

# సెన్సెక్స్ 685 పాయింట్ల లాభం




ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన నిర్ణయం వెలువడనున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు ఫార్మా, ప్రైవేట్ బ్యాంకింగ్, చమురు-గ్యాస్ షేర్లను కొనుగోలు చేశారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా రెండో సెషన్‌లోనూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 685.34 పాయింట్లు పెరిగి 73,067.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 220.35 పాయింట్లు లాభపడి 22,776.10 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ మరోసారి 22,750 మార్కును దాటింది. నిఫ్టీ 22,800 స్థాయిని నిలబెట్టుకుంటే 23,000 మార్కు దిశగా వెళ్లే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దిగువన 22,600 వద్ద తక్షణ మద్దతు ఉందని, ఆ తర్వాత 22,500 కీలక స్థాయిగా ఉంటుందని తెలిపారు. అమ్మకాల ఒత్తిడి క్రమంగా తగ్గుతోందని చెప్పారు. ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయంపై మార్కెట్ వర్గాలు ప్రధానంగా దృష్టి పెట్టాయి. వడ్డీ రేట్లు, నగదు లభ్యత, ఆర్థిక పరిస్థితులపై కేంద్ర బ్యాంకు వైఖరి ఎలా ఉంటుందన్నదానిపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నారు. నిఫ్టీలో ట్రెంట్, బీఎస్ఈ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీగా లాభపడ్డాయి. ఫార్మా, కెమికల్ షేర్లలో కొనుగోళ్లు ఎక్కువగా కనిపించాయి. నిఫ్టీ ఫార్మా సూచీ అత్యధికంగా లాభపడగా, కెమికల్ సూచీ తర్వాతి స్థానంలో నిలిచింది. విస్తృత మార్కెట్‌లోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.08 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ 1.56 శాతం లాభపడింది. మరోవైపు ఐటీ షేర్లలో కొంత లాభాల స్వీకరణ జరిగింది. దీంతో నిఫ్టీ ఐటీ సూచీ రోజులో అత్యధికంగా నష్టపోయిన రంగంగా నిలిచింది. ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు కలిసొచ్చిందని నిపుణులు తెలిపారు. దేశీయ మార్కెట్లలో సానుకూల వాతావరణం ఉన్నా ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ప్రభావం కొనసాగుతోందని పేర్కొన్నారు. సమీప కాలంలో మార్కెట్ ధోరణి సానుకూలంగానే ఉన్నా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.

# 11 లక్షల కోట్ల వాల్యుయేషన్‌తో జియో ఐపీఓ

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలికాం డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్, భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)లలో ఒకటిగా నిలిచేందుకు సిద్ధమవుతోంది. సుమారు రూ. 11 లక్షల కోట్ల (114 బిలియన్ డాలర్లు) భారీ వాల్యుయేషన్‌తో ఐపీఓకు వచ్చేందుకు కంపెనీ సన్నాహాలు చేస్తోంది. అంతా ప్రణాళికాబద్ధంగా జరిగితే, అక్టోబరు 19న ప్రారంభమయ్యే వారంలో ఐపీఓ ప్రక్రియ మొదలై, అక్టోబరు 30 నాటికి లిస్టింగ్ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ వాల్యుయేషన్‌తో స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయితే, జియో ప్లాట్‌ఫామ్స్ దేశంలోనే మూడవ అతిపెద్ద లిస్టెడ్ కంపెనీగా అవతరిస్తుంది. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఐపీఓ ద్వారా జియో సుమారు 3.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 28,000 కోట్లు) నిధులను సమీకరించే అవకాశం ఉంది. ఇదే గనుక జరిగితే, ఇటీవలే హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ (2.9 బిలియన్ల డాలర్లు) నెలకొల్పిన రికార్డును జియో అధిగమించి, నిధుల సమీకరణలో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టిస్తుంది. గతంలో జియో వాల్యుయేషన్‌పై 130 బిలియన్ల డాలర్ల నుంచి 170 బిలియన్ల డాలర్ల వరకు అంచనాలు వెలువడినప్పటికీ, ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా కంపెనీ వాస్తవిక అంచనాలతో ముందుకొస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లలో నెలకొన్న బలహీన సెంటిమెంట్ కారణంగా పలు ఐపీఓల ధరలపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో, జియో సైతం తన వాల్యుయేషన్‌ను సవరించుకున్నట్లు తెలుస్తోంది.



లయ్యాలి చిత్రం






## తేజ సజ్జా ది ట్రెయిటర్స్ రియాలిటీ షో

టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా సరికొత్త అవతారంలోకి మారారు. నటుడిగా వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఆయన, ఇప్పుడు హోస్ట్‌గా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్న 'ది ట్రెయిటర్స్ తెలుగు' అనే రియాలిటీ షోకు తేజ హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. "మోసం ఇక్కడ కొత్త రూల్" అనేది క్యాప్షన్. మంగళవారం ఈ షోకు సంబంధించిన ట్రైలర్‌ను నిర్వాహకులు విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన 'ది ట్రెయిటర్స్' ఫార్మాట్‌ను తొలిసారిగా తెలుగులోకి తీసుకువస్తున్నారు. ఈ షోలో వివిధ రంగాలకు చెందిన 20 మంది ప్రముఖులు పాల్గొంటున్నారు. వారిలో సింగర్ చిన్మయి శ్రీపాద, నటులు హర్షవర్ధన్, ప్రగతి, శ్రీదేవి చౌదరి, నిఖిల్ విజయేంద్ర సింహ, విద్యుల్లత రామన్, విష్ణు ఓయ్, సాయి రోనక్ వంటి పలువురు సెలబ్రిటీలు ఉన్నారు. ఈ షో గురించి తేజ సజ్జా మాట్లాడుతూ.. ""ది ట్రెయిటర్స్ తెలుగు'కు హోస్ట్‌గా వ్యవహరించడం నాకు పూర్తిగా కొత్త అనుభవం. ఇప్పటివరకు నేను చేసిన వాటికి ఇది పూర్తి భిన్నమైనది కావడంతో చాలా ఉత్సాహంగా ఉన్నాను" అని తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఒక ఫార్మాట్‌ను తొలిసారి తెలుగులోకి మన అభిరుచికి తగ్గట్టుగా తీసుకురావడం సంతోషంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు."నిజం చెప్పాలంటే, ఈ గేమ్ కంటెస్టెంట్స్‌కు ఎంత అనూహ్యమో, హోస్ట్‌గా నాక్కూడా అంతే అనూహ్యం. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో క్షణాల్లో మారిపోతుంది.

## రెట్టింపు వినోదంతో 'హుషారు 2'

టాలీవుడ్ యువతను ఒక ఊపు ఊపేసిన ఐకానిక్ యూత్‌ఫుల్ ఫ్రాంచైజీ 'హుషారు' మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటోంది. 2018లో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన ఈ సినిమా, యూత్ కల్చర్‌కు కొత్త అర్థం చెప్పింది. ఇప్పుడు అదే జోరును కంటిన్యూ చేస్తూ, దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'హుషారు 2'ను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ, సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్ చూస్తేనే మేకర్స్ ఎలాంటి డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్నారో అర్థమవుతోంది.




## షారుక్ 'కింగ్'లో కరీనా ఐటం సాంగ్



బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'కింగ్' ఒకటి. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'వార్', 'పఠాన్' వంటి భారీ చిత్రాలను తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ వెండితెరకు కథానాయికగా పరిచయం కానుండటం కూడా 'కింగ్'పై భారీ అంచనాలు నెలకొనేలా చేసింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన సమాచారం బాలీవుడ్ వర్గాల్లో వైరల్‌గా మారింది. ప్రముఖ నటి కరీనా కపూర్ 'కింగ్'లో ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అంతేకాదు.. ఆమె కోసం ప్రత్యేకంగా ఓ పాటను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీనా కపూర్ 'కింగ్'లో ఓ ప్రత్యేక పాటలో మెరవనున్నారు. ఈ పాటను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు చిత్రబృందం ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. ఈ నెలాఖరులో దక్షిణాఫ్రికాలో ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ జరగనున్నట్లు సమాచారం.

## 'కామ్రేడ్ కల్యాణ్'.. నవ్వులే నవ్వులు

విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టాలీవుడ్‌కు చెందిన 9 మంది ప్రముఖ దర్శకులు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. రామ్ గోపాల్ వర్మ, హరీశ్ శంకర్, అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బాబీ, శివ నిర్వాణ, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, రామ్ అబ్బరాజు వంటి అగ్ర దర్శకులు కలిసి ఈ ట్రైలర్‌ను లాంచ్ చేయడం ఇండస్ట్రీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'కామ్రేడ్ కల్యాణ్' ట్రైలర్ విషయానికొస్తే, ఆద్యంతం నవ్వులు పంచేలా దీన్ని తీర్చిదిద్దారు. ఒక థియేటర్ ఓనర్ అయిన హీరో, అనుకోకుండా 'కామ్రేడ్'గా మారడం, ఆ తర్వాత జరిగే పరిణామాలు ఫన్నీగా ఉంటాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. శ్రీవిష్ణు తనదైన కామెడీ టైమింగ్‌తో, మేనరిజమ్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయన తల్లి పాత్రలో సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ నటన, కమెడియన్ సత్యతో సాగే సన్నివేశాలు నవ్వులు పూయించడం ఖాయంగా కనిపిస్తోంది. వెన్నెల కిషోర్, ఉపేంద్ర లిమాయే వంటి నటులు కూడా తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, షైన్ టామ్ చాకో కీలకమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న 'కామ్రేడ్ కల్యాణ్' సినిమాను వెంకటకృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. తన సినిమాకు మద్దతుగా నిలిచిన దర్శకులకు కోన వెంకట్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "నా బలం, నా వాళ్లు" అంటూ వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.




## ప్యారిస్‌లో పాలరాతి బొమ్మలా జాన్వీ

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరినీ అబ్బురపరిచారు. ప్యారిస్‌లో జరిగిన ఓ గాలా ఈవెంట్‌లో ఆమె ధరించిన ప్రత్యేకమైన చీరకట్టు ఇప్పుడు అంతర్జాతీయ ఫ్యాషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారతీయ హస్తకళకు ఆధునిక సొబగులు అద్దిన ఈ లుక్‌తో జాన్వీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి జాన్వీ న్యూఢిల్లీకి చెందిన 'పంకజ్ ఎస్. హెరిటేజ్' లేబుల్ డిజైన్ చేసిన చీరను ఎంచుకున్నారు. సహజమైన ఐవరీ రంగులో ఉన్న ఈ చీరను చారిత్రక ప్రాధాన్యమున్న 460-కౌంట్ బెంగాల్ మస్లిన్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారు. మొఘలుల కాలంలో ఢాకా ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఈ వస్త్రాన్ని 'బాఫ్త హవా' (నేసిన గాలి) అని పిలిచేవారు. అంతటి సున్నితమైన చీరపై తెల్లటి చికంకారీ ఎంబ్రాయిడరీ అదనపు అందాన్ని తెచ్చిపెట్టింది. అయితే, ఈ చీరకట్టులో అసలైన హైలైట్ ఆమె ధరించిన బ్లౌజ్. ఈ బ్లౌజ్ స్లీవ్స్‌ను పోల్కీలు, గార్నెట్‌లు, పచ్చలతో దట్టంగా పొదిగారు. ఈ స్లీవ్స్ భుజాలపై నుంచి జాలువారుతున్న ఆభరణాల్లా కనిపించడంతో జాన్వీ మెడలో ఎలాంటి నెక్లెస్ ధరించకుండానే సంపూర్ణమైన లుక్‌ను సాధించారు. దీనికి తగ్గట్టుగా కోల్‌కతాకు చెందిన 'విర్రాయా జ్యూయలరీ' చెవిపోగులు, కఫ్‌లతో పాటు స్లీవ్స్‌కు మ్యాచింగ్ అయ్యేలా పచ్చలు పొదిగిన ఉంగరాన్ని ధరించారు. మేకప్ ఆర్టిస్ట్ నోరా కౌర్కిస్ అందించిన సాఫ్ట్ గ్లామ్ మేకప్, స్లీక్ బన్ హెయిర్‌స్టైల్ ఈ లుక్‌ను మరింత ఉన్నతంగా నిలబెట్టాయి.





## మా ప్రేమ గాసిప్ కోసం కాదు

సెలబ్రిటీల ప్రేమకథల్లో ఏదో ఒక దశలో 'ఎప్పుడు ప్రేమలో పడ్డారు?', 'ఎవరు ముందుగా ప్రపోజ్ చేశారు?' అనే ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ విషయంలో మాత్రం ఈ ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పడం కాస్త కష్టమే. ఎందుకంటే.. తమ బంధానికి వాళ్లు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన తేదీ పెట్టుకోలేదు. ప్రేమను ప్రకటించుకోలేదు. ప్రపోజ్ కూడా చేసుకోలేదు. అయినా ఒకరితో ఒకరు ఉంటూ.. తమ బంధం ఎప్పుడు ప్రేమగా మారిందో తెలియకుండానే పెళ్లి వరకు వచ్చేశారు. 2026 ఫిబ్రవరిలో రష్మిక, విజయ్ పెళ్లి చేసుకున్నారు. అప్పటివరకు వీరిద్దరి గురించి ఎన్నో వార్తలు వచ్చినా.. తమ వ్యక్తిగత జీవితంపై మాత్రం ఇద్దరూ పెద్దగా మాట్లాడలేదు. తాజాగా 'రణబాలి' ప్రమోషన్లలో భాగంగా శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఈ జంట.. చాలాకాలం తమ రిలేషన్‌షిప్‌ను ఎందుకు ప్రైవేట్‌గా ఉంచారో చెప్పారు. విజయ్ మాటల్లో చెప్పాలంటే.. రష్మికతో తన పరిచయం తొలుత ప్రేమతో మొదలవలేదు. ఇద్దరూ కలిసి పనిచేసే కోస్టార్స్ అంతే.

## త్వరలో రామాయణ రెండో ట్రైలర్!

భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో 'రామాయణ' కూడా ఒకటి. బాలీవుడ్ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పౌరాణిక ఇతిహాస కథపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. 'రామాయణ'లో బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో కనిపించనుండగా, సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్నారు. కన్నడ స్టార్ యష్ కీలకమైన రావణుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ ముగ్గురు అగ్ర నటులు ఒకే ప్రాజెక్టులో భాగం కావడంతో సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. భారతీయ ఇతిహాసాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన రామాయణ కథను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారీ స్థాయిలో తెరపై ఆవిష్కరించేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన తొలి ట్రైలర్‌ను విడుదల చేశారు. రాబోయే కొద్ది రోజుల్లోనే 'రామాయణ' రెండో ట్రైలర్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే రెండో ట్రైలర్ విడుదల తేదీపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. బాలీవుడ్ మైథలాజికల్ ప్రాజెక్ట్ అయిన 'రామాయణ' (=ఘుఝుఝుఘు) షూటింగ్ సెట్‌లో ఊహించని అగ్నిప్రమాదం సంభవించింది. ముంబైలోని ప్రముఖ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ ప్రాంగణంలో ఈ అపశృతి




చోటు చేసుకుంది. సెట్‌కు వెలుపల వేసిన తాత్కాలిక టెంట్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్టూడియో సిబ్బందితో పాటు చిత్ర యూనిట్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇక సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, స్టూడియో రక్షణ బృందాలు అప్రమత్తమై వెంటనే రంగంలోకి దిగాయి. తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఎవరికీ గాయాలు కాలేదని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ అధ్యక్షుడు బి.ఎన్. తివారీ అధికారికంగా స్పష్టం చేశారు. అయితే, ఘటన జరిగిన సమయంలో సెట్‌లో పెద్ద సంఖ్యలో సిబ్బంది ఉండటంతో కొంతసేపు తీవ్ర భయాందోళన వాతావరణం నెలకొంది. నితీశ్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రం మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 6న పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.












# కెప్టెన్సీకి హర్మన్‌ప్రీత్ 'గుడ్‌బై

భారత మహిళా క్రికెట్ జట్టులో ఒక శకం ముగిసింది. జట్టును విజయపథంలో నడిపించిన సక్సెస్‌ఫుల్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, తన సారథ్య బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేసింది. ఇవాళ ఆమె అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీకి వీడ్కోలు పలుకుతున్నట్లు వెల్లడించింది. ఇటీవలే ముగిసిన ఆసియా క్రీడలు 2026లో భారత జట్టుకు వరుసగా రెండోసారి స్వర్ణ పతకాన్ని అందించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం తీసుకోవడం క్రీడా వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన పోస్ట్ చేసింది. "కెప్టెన్సీ నుంచి వైదొలగాలన్న నిర్ణయం అంత సులభం కాదు. ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలు, త్యాగాలు, జట్టు ఎదుగుదల కోసం తీసుకున్న కఠిన నిర్ణయాల సమాహారం ఈ ప్రయాణం. ఈ రోజు కెప్టెన్సీని వీడుతున్నప్పుడు నా హృదయం భావోద్వేగాలతో నిండి ఉంది, కానీ అదే సమయంలో మనసు ప్రశాంతంగా ఉంది. ఎందుకంటే నా జట్టు ఇప్పుడు చాలా మంచి స్థితిలో ఉందని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను" అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది.




## మహిళల జట్టు కొత్త కెప్టెన్‌గా స్మృతి మంధాన

భారత మహిళా క్రికెట్ జట్టు నూతన సారథిగా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితురాలైంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం ప్రకటించింది. ఇప్పటివరకు కెప్టెన్‌గా ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, ఆమె స్థానంలో వైట్-బాల్ క్రికెట్‌కు పూర్తిస్థాయి కెప్టెన్‌గా మంధాన బాధ్యతలు చేపట్టనుంది.

**2013లో అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి జట్టులో కీలక సభ్యురాలిగా కొనసాగుతున్న స్మృతి మంధానకు సారథ్య బాధ్యతలు కొత్తేమీ కాదు. గతంలో ఆమె 18 టీ20లు, నాలుగు వన్డే మ్యాచ్‌లలో భారత జట్టును ముందుండి నడిపించింది. దేశీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ ఆమె తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నారు.**

ముఖ్యంగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును 2024, 2026 సంవత్సరాల్లో విజేతగా నిలిపి టైటిల్స్ అందించింది. తన నియామకంపై స్మృతి మంధాన స్పందిస్తూ, "భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం లభించడం ఒక ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నాను. నాపై నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచర క్రీడాకారిణులు, నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ అందించిన విశేష సేవలను నేను గౌరవిస్తున్నాను. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి, భారత క్రికెట్‌ను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేస్తాను" అని ఒక ప్రకటనలో పేర్కొంది. స్మృతి మంధాన నియామకంపై బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా హర్షం వ్యక్తం చేశారు. జట్టును విజయపథంలో నడిపించే సత్తా, అపార అనుభవం ఆమెకు ఉన్నాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. గౌహతిలో జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న జింబాబ్వే సిరీస్‌తో స్మృతి మంధాన కెప్టెన్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించనుంది.

# అగార్కర్ గుడ్ బై

## సెలక్షన్ కమిటీ తాత్కాలిక బాధ్యతలు చేపట్టిన ప్రజ్ఞాన్ ఓఝా




బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ పదవీకాలం ముగిసింది. అక్టోబర్ 4వ తేదీతో అతని కాంట్రాక్ట్ ముగియగా, గువాహటిలో జరిగిన తాజా సెలక్షన్ కమిటీ సమావేశానికి అగార్కర్ హాజరుకాలేదు. దీంతో అతని పదవి నుంచి వైదొలగినట్లేనని స్పష్టమవుతోంది. ప్రముఖ క్రీడా వెబ్‌సైట్ 'క్రిక్‌బజ్' తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. అగార్కర్ గైర్హాజరీలో, సెలక్షన్ కమిటీ సభ్యుడిగా ఉన్న మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓఝాను సమావేశానికి ఛైర్మన్‌గా వ్యవహరించాలని బీసీసీఐ కోరినట్లు సమాచారం. ప్రస్తుతం టీమిండియా తదుపరి చీఫ్ సెలక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓఝా పేరు బలంగా వినిపిస్తోంది. ప్రస్తుత సెలక్షన్ ప్యానెల్‌లో ఉన్నవారిలో అత్యధిక టెస్టులు ఆడిన అనుభవం ఓఝాకే ఉంది. ఓఝా 24 టెస్టులు ఆడగా, శివ్ సుందర్ దాస్ 23, ఆర్పీ సింగ్ 14, అజయ్ రాత్రా 6 టెస్టుల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఈ సీనియారిటీ కారణంగానే ఆయనకు ఛైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. "బీసీసీఐలో ఏదైనా జరగవచ్చు. కానీ, ఓఝా అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిగా కనిపిస్తున్నారు" అని బోర్డు వర్గాలు పేర్కొన్నట్లు సదరు కథనం తెలిపింది. అయితే, చీఫ్ సెలక్టర్ ఎంపిక ప్రక్రియపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. ఓఝానే పూర్తిస్థాయి ఛైర్మన్‌గా కొనసాగిస్తారా? లేక కొత్త వారిని నియమిస్తారా? అనేది తేలాల్సి ఉంది. గత కొంతకాలంగా మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ పార్థివ్ పటేల్ పేరు కూడా ఈ పదవికి వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ తుది నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.



# భారత్‌పై ఉరుగ్వే ఘన విజయం

### స్నేహపూర్వక మ్యాచ్‌లో 6-1 గోల్స్‌తో టీమిండియా ఓటమి

అంతర్జాతీయ స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో భారత జట్టుకు భారీ ఓటమి ఎదురైంది. కోల్‌కతాలోని చారిత్రాత్మక వివేకానంద యువ భారతి క్రీడాంగణం (సాల్ట్ లేక్ స్టేడియం) వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బలమైన ఉరుగ్వే జట్టు 6-1 గోల్స్ తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. భారత ఆటగాడు అనిరుధ్ థాపా ఒక గోల్ చేసినప్పటికీ, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఉరుగ్వే దూకుడు ప్రదర్శించింది. ఆట 11వ నిమిషంలోనే లభించిన పెనాల్టీని డార్విన్ నూనెజ్ గోల్‌గా మలిచి ఉరుగ్వేకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, సొంతగడ్డపై అభిమానుల మద్దతుతో ఆడుతున్న భారత జట్టు వెంటనే పుంజుకుంది. 21వ నిమిషంలో అనిరుధ్ థాపా అద్భుతమైన గోల్ సాధించి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో స్టేడియం ఒక్కసారిగా హోరెత్తింది. కానీ, ఈ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. 27వ నిమిషంలో మాక్సిమిలియానో అరౌజో గోల్ చేయడంతో ఉరుగ్వే మళ్లీ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ప్రథమార్ధం ఇదే స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధం ప్రారంభమైన తర్వాత ఉరుగ్వే మరింత చెలరేగి ఆడింది. భారత రక్షణ శ్రేణిని ఛేదిస్తూ వరుస గోల్స్‌తో విరుచుకుపడింది. 52వ నిమిషంలో రొడ్రిగో జలజార్, 58వ నిమిషంలో మాక్సిమిలియానో అరౌజో తన రెండో గోల్, 70వ నిమిషంలో జువాన్ మాన్యువల్ సనాబ్రియా, 85వ నిమిషంలో రొడ్రిగో అగ్యురె గోల్స్ సాధించడంతో ఉరుగ్వే భారీ విజయాన్ని ఖాయం చేసుకుంది. గణాంకాలను పరిశీలిస్తే, బంతిని 58% సమయం తమ ఆధీనంలో ఉంచుకున్న ఉరుగ్వే, గోల్ పోస్ట్‌పై 9 సార్లు కచ్చితమైన షాట్లు కొట్టింది. మరోవైపు, భారత్ 14 సార్లు గోల్ కోసం ప్రయత్నించినప్పటికీ, 5 షాట్లు మాత్రమే లక్ష్యం వైపు వెళ్లాయి. ప్రపంచ స్థాయి జట్టుతో ఆడిన ఈ మ్యాచ్, భారత జట్టుకు కీలకమైన పాఠాలను నేర్పిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఈ మ్యాచ్ లో స్కోరు 1-1తో సమంగా ఉన్న సమయంలో ఉరుములు, మెరుపులతో వాతావరణం మారిపోవడంతో మ్యాచ్ కు అంతరాయం కలిగింది.




# శ్రేయస్ శతకబాదుడు

### 14.4 ఓవర్లలోనే టీమిండియా లక్ష్య ఛేదన

వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర సెంచరీతో కదం తొక్కాడు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై, అయ్యర్ ఆడిన సుడిగాలి ఇన్నింగ్స్ ముందు వెస్టిండీస్ బౌలర్లు తేలిపోయారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అయ్యర్.. టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. అతని బ్యాటింగ్ ధాటికి 172 పరుగుల లక్ష్యం చాలా చిన్నదిగా కనిపించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో షాయ్ హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధీర్ 3 వికెట్లతో సత్తా చాటగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఆట స్వరూపాన్నే మార్చేశాడు. వచ్చినప్పటి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతనికి ఇషాన్ కిషన్ (37 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. ఒకవైపు అయ్యర్ బౌండరీల వర్షం కురిపిస్తుండగా, మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ సంయమనంతో ఆడి వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయ్యర్ తన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఫలితంగా భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది. తమ ఇన్నింగ్స్ లో మరో 20 పరుగులు చేసుంటే బాగుండేదని విండీస్ భావించినప్పటికీ, అయ్యర్ బ్యాటింగ్ తీరు చూశాక మరో 60 పరుగులు చేసినా కరీబియన్లు గెలవలేరని స్పష్టమైంది. ఇక ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న రాంచీలో జరగనుంది.

# న్యూజిలాండ్ పర్యటనకు భువనేశ్వర్




న్యూజిలాండ్ పర్యటన కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) మంగళవారం టీ20, ఇండియా-ఎ జట్లను ప్రకటించింది. ఈ ఎంపికలో పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ టీ20 జట్టులోకి పునరాగమనం చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మరోవైపు, స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు ఇండియా-ఎ జట్టులో స్థానం కల్పించారు. ఈ పర్యటనలో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టుకు యువ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తెలుగు తేజం తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. గాయం కారణంగా ఏషియన్ గేమ్స్‌కు దూరమైన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్ వంటి యువ ఆటగాళ్లకు సెలక్టర్లు అవకాశమిచ్చారు. చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి అజిత్ అగార్కర్ వైదొలిగిన తర్వాత, తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రజ్ఞాన్ ఓజా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఈ జట్లను ఎంపిక చేయడం గమనార్హం.

**భారత టీ20 జట్టు**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్) తిలక్ వర్మ (వైస్ కెప్టెన్) అభిషేక్ శర్మ సంజూ శాంసన్ (వికెట్ కీపర్) వైభవ్ సూర్యవంశీ ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్) అక్షర్ పటేల్ శివమ్ దూబే నితీశ్ కుమార్ రెడ్డి నమన్ ధీర్ ప్రిన్స్ యాదవ్ మయాంక్ యాదవ్ అర్ష్‌దీప్ సింగ్ భువనేశ్వర్, వరుణ్ చక్రవర్తి కుల్దీప్ యాదవ్

ఈవార్తలు
# ప్రజావాణి
బుధవారం 7-10-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ధరల మంటల్లో సామాన్యుడు బుగ్గి

ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విద్య, వైద్యం, ఇంటి అద్దెలు.. ఇలా సామాన్యుడి నెలవారీ ఖర్చుల జాబితా అంతకంతకూ పెరుగుతూనే ఉంది. వచ్చే జీతం ఎక్కడ ఖర్చవుతుందో తెలియక మధ్యతరగతి కుటుంబం లెక్కలు వేసుకుంటుంటే.. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబం బతుకుబండి ఎలా నడపాలో ఆలోచిస్తోంది. ఇలాంటి సమయంలో తెలంగాణ ప్రజల నెత్తిన విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో మరో భారం పడటం ఆందోళన కలిగించే పరిణామం. ట్రూఅప్ అంటే గతంలో అంచనా వేసిన విద్యుత్ వ్యయం, వాస్తవంగా జరిగిన వ్యయం మధ్య తేడాను తర్వాత సర్దుబాటు చేయడం. విద్యుత్ రంగంలో ఇటువంటి సర్దుబాట్లకు నియంత్రణ వ్యవస్థలో నిబంధనలు ఉన్నప్పటికీ.. చివరికి ఆర్థిక భారం ఎవరిపై పడుతోంది అన్నదే అసలు ప్రశ్న. తాజా నిర్ణయం ప్రకారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ కొనుగోలు, ఆదాయ సర్దుబాట్లకు సంబంధించి రూ.7,635 కోట్ల ట్రూఅప్ మొత్తాన్ని ఆమోదించింది. అందులో రూ.5,420 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి రెండు సంవత్సరాలకు పైగా వసూలు చేయడానికి అనుమతి ఇచ్చింది. నవంబర్ నుంచి బిల్లుల్లో అదనపు వసూళ్లు కనిపించనున్నాయి. అంటే.. తప్పు ఎవరిదైనా బిల్లు మాత్రం వినియోగదారుడిదే అన్న పరిస్థితి! విద్యుత్ సంస్థలకు వాస్తవ వ్యయాలు పెరిగి ఉంటే వాటిని లెక్కలోకి తీసుకోవడం ఒక విధానం కావచ్చు. కానీ పాలనలో ఆర్థిక క్రమశిక్షణకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తిన ప్రతిసారీ ప్రజలే ఎందుకు మూల్యం చెల్లించాలి? విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితి, ప్రభుత్వ శాఖల బకాయిలు, విద్యుత్ కొనుగోళ్ల వ్యయం, ప్రాజెక్టుల ఆర్థిక ప్రయోజనం.. ఇవన్నీ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇంకో వైపు ప్రభుత్వ శాఖల విద్యుత్ బకాయిల అంశం కూడా చర్చకు వస్తోంది. కొన్ని నివేదికల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ శాఖల నుంచి విద్యుత్ పంపిణీ సంస్థలకు భారీ బకాయిలు పేరుకుపోయాయి. సాగునీటి ఎత్తిపోతల పథకాల విద్యుత్ బిల్లులే అందులో పెద్ద వాటాను కలిగి ఉన్నట్లు సమాచారం. అయితే సామాన్య వినియోగదారుడు తన విద్యుత్ బిల్లును గడువులోగా చెల్లించకపోతే జరిమానా.. ఆలస్యం అయితే అదనపు భారం.. కానీ ప్రభుత్వ విభాగాల బకాయిల విషయంలో మాత్రం ప్రజలే పరోక్షంగా భారం మోయాల్సిన పరిస్థితి ఎందుకు? ఇక్కడే పాలకుల బాధ్యత ప్రశ్నార్థకమవుతోంది. ప్రజల కోసం పథకాలు అవసరమే. సంక్షేమం కూడా అవసరమే. అభివృద్ధి పనులు కూడా అవసరమే. కానీ ప్రతి పథకం ప్రజల జీవితాలను మెరుగుపరచాలి. పెట్టుబడికి తగ్గ ఫలితం ఇవ్వాలి. ప్రజాధనానికి విలువ తీసుకురావాలి. ఉపయోగం తక్కువగా ఉన్న పథకాలు, రాజకీయ ప్రయోజనాల కోసం రూపొందించిన కార్యక్రమాలు, ఆర్థిక భారం పెంచే నిర్ణయాలు.. చివరికి రాష్ట్ర ఖజానాపై ఒత్తిడి పెంచితే ఆ భారాన్ని ఎక్కడో ఒకచోట ప్రజలే మోయాల్సి వస్తుంది. ప్రజల డబ్బుతో పథకం.. ప్రజల డబ్బుతో ప్రచారం.. చివరికి ప్రజలకే బిల్లు! ఇది ఆరోగ్యకరమైన ఆర్థిక నిర్వహణకు సంకేతం కాదు. ప్రభుత్వం ఒక రూపాయి ఖర్చు చేసే ముందు అది ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూరుస్తుందో ప్రశ్నించుకోవాలి. ఒక పథకానికి వందల కోట్లు ఖర్చు చేస్తే దాని ఫలితం ఏమిటి? ఎన్ని కుటుంబాలకు ప్రయోజనం కలిగింది? ఎంత ఆదా జరిగింది? ఎంత ఆదాయం వచ్చింది? ఎంత ఉపాధి సృష్టించబడింది? అనే ప్రశ్నలకు ప్రజలకు సమాధానం చెప్పాలి.




# మరో శకం.. మహిళా సాధికారత

భారత మహిళా క్రికెట్ చరిత్రలో ఒక తరం ముగిసి.. మరో తరం మొదలవుతోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత మహిళా క్రికెట్ తనదైన గుర్తింపును సంపాదించుకుంది. సవాళ్లను ఎదుర్కొంటూ జట్టును ముందుకు నడిపిన ఆమె శకం.. ఇప్పుడు స్మృతి మంధాన చేతుల్లోకి కొత్త ఆశలతో మారుతోంది. హర్మన్‌ప్రీత్ కేవలం ఒక క్రికెటర్ కాదు.. భారత మహిళా క్రీడాకారిణులకు ధైర్యం ఇచ్చిన ఒక దశకు ప్రతీక. మంధాన ఆ వారసత్వాన్ని అందిపుచ్చుకుని మరింత దూకుడుగా, మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను మోస్తోంది. ఇది కేవలం నాయకత్వ మార్పు కాదు.. మహిళా సాధికారతకు మారుతున్న ముఖచిత్రం. ఒకరు తలుపులు తెరిచారు.. మరొకరు ఆ తలుపుల గుండా కొత్త తరాన్ని నడిపించాలి. మైదానంలో వారి బ్యాట్ నుంచి వచ్చే పరుగుల కంటే.. దేశంలోని కోట్లాది బాలికలకు వారు ఇచ్చే స్ఫూర్తి విలువైనది. హర్మన్‌ప్రీత్ శకం ఒక చరిత్ర.. మంధాన శకం ఒక కొత్త అధ్యాయం. భారత మహిళా క్రికెట్ ఇక మరింత ఎత్తుకు ఎదగాలి.



అలేఖ్య కట్కం

# మోదీ సిల్వర్ జూబ్లీ.. మిగిలిన ప్రశ్నలు!

2001 అక్టోబర్ 7.. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన రోజు. 2026 అక్టోబర్ నాటికి ప్రభుత్వ అధినేతగా ఆయన పాలనా ప్రయాణం 25 ఏళ్లకు చేరింది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా మొదలైన ఈ ప్రయాణం.. 2014లో దేశ ప్రధానమంత్రి పదవికి చేరి, వరుసగా మూడుసార్లు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయికి వెళ్లింది. 25 ఏళ్లపాటు నిరంతరంగా ప్రభుత్వ అధినేతగా కొనసాగడం భారత రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టం. ఈ పాతికేళ్లను కేవలం ఒక నాయకుడి రాజకీయ ప్రస్థానంగా చూడటం సరిపోదు.





ఇది భారత పాలనా వ్యవస్థలో వచ్చిన మార్పులను, ఆర్థిక విధానాలను, సంక్షేమ పథకాల విస్తరణను, మౌలిక వసతుల అభివృద్ధిని, రాజకీయ సంస్కృతిలో వచ్చిన మార్పులను కొలిచే ఒక సందర్భం. అదే సమయంలో ఈ ప్రయాణంలో తలెత్తిన ప్రశ్నలను కూడా మర్చిపోకూడదు. మోదీ పాలనలో ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, బ్యాంకు ఖాతాల విస్తరణ, ఇళ్లు, మరుగుదొడ్లు, తాగునీరు, వంటగ్యాస్, విద్యుత్, ఆరోగ్య బీమా వంటి ప్రాథమిక సౌకర్యాలపై ప్రభుత్వాలు పెద్ద ఎత్తున దృష్టి పెట్టాయి. నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం 2015-16 నుంచి 2019-21 మధ్య బహుముఖ పేదరికంలో ఉన్న జనాభా వాటా 24.85 శాతం నుంచి 14.96 శాతానికి తగ్గింది. 2013-14 నుంచి 2022-23 మధ్య సుమారు 24.82 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ అంచనా వేసింది. అయితే పేదరికం తగ్గిందన్న గణాంకంతో కథ పూర్తికాదు. ఒక కుటుంబానికి ఇల్లు వచ్చింది.. బ్యాంకు ఖాతా వచ్చింది.. ఉచిత బియ్యం వచ్చింది అంటేనే ఆ కుటుంబం ఆర్థికంగా స్థిరపడినట్టా? నెలకు సరిపడా ఆదాయం ఉందా? యువకుడికి స్థిరమైన ఉద్యోగం దొరికిందా? రైతుకు పంటకు తగిన ధర వచ్చిందా? చిన్న వ్యాపారి అప్పుల నుంచి బయటపడ్డాడా? ఇవే అసలు ప్రశ్నలు. వస్తు సేవల పన్ను, పెద్ద నోట్ల రద్దు, దివాలా చట్టం, డిజిటల్ చెల్లింపుల విస్తరణ, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపాయి. ఒకవైపు పన్నుల వ్యవస్థను సరళీకరించే ప్రయత్నాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ జరిగితే.. మరోవైపు పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలపై ఇప్పటికీ ఆర్థిక ప్రభావం, చిన్న వ్యాపారాలపై పడిన భారం వంటి అంశాలపై చర్చ కొనసాగుతూనే ఉంది. మౌలిక వసతుల విషయంలోనూ భారీ పెట్టుబడులు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం గణనీయంగా పెరగడం, రహదారులు-రైల్వేల విస్తరణ, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి పెరుగుదల వంటి అంశాలను మోదీ ప్రభుత్వం తన ప్రధాన విజయాలుగా చూపుతోంది. 2026లో కేంద్ర మంత్రివర్గం విడుదల చేసిన సమీక్షలోనూ ఈ అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించింది.

మోదీ పాలనలో నిర్ణయాలు వేగంగా తీసుకునే రాజకీయ శైలి స్పష్టంగా కనిపించింది. దేశవ్యాప్తంగా ఒకే రాజకీయ దిశలో ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించే సామర్థ్యం ఆయన నాయకత్వానికి ప్రత్యేక లక్షణంగా నిలిచింది. కానీ ప్రజాస్వామ్యంలో నాయకుడి బలం ఒక్కటే సరిపోదు. పార్లమెంటు, న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ, మీడియా, ప్రతిపక్షాలు, పౌర సమాజం వంటి సంస్థలు కూడా సమానంగా బలంగా ఉండాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశ వ్యతిరేకత కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రభుత్వ బలహీనత కాదు. ప్రజాస్వామ్యానికి అదే బలం. 25 ఏళ్ల పాలనకు ఇదే అతిపెద్ద కొలమానం. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రాధాన్యం పెరగడం ఒక వాస్తవం. మౌలిక వసతులు పెరగడం మరో వాస్తవం. పేదరికం తగ్గినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఉద్యోగాల నాణ్యత, యువతకు అవకాశాలు, రైతుల ఆదాయం, చిన్న వ్యాపారాల పరిస్థితి, ధరల భారం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాల్లో ప్రజల అనుభవం మరో కథ చెబుతోంది. ఒక దేశం పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం అవసరం. కానీ ఆ వృద్ధి ప్రతి ఇంటి గడప దాటినప్పుడే దానికి సామాజిక అర్థం ఉంటుంది. మెట్రో నగరాల్లో ఎత్తైన భవనాలు పెరగడం అభివృద్ధి. అదే సమయంలో గ్రామంలో రైతు తన పంటను అమ్ముకుని అప్పు తీర్చగలగడం కూడా అభివృద్ధే. అంతరిక్షంలో భారత్ జెండా ఎగరడం గర్వకారణం. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లవాడికి నాణ్యమైన విద్య అందడం కూడా అంతే ముఖ్యం.

మోదీ 25 ఏళ్ల పాలనా ప్రయాణాన్ని పూర్తిగా విజయగాథగా ముద్ర వేయడం ఎంత ఏకపక్షమో.. పూర్తిగా వైఫల్యంగా కొట్టిపారేయడం కూడా అంతే ఏకపక్షం. ఈ కాలంలో దేశంలో జరిగిన మార్పులను గణాంకాలతో కొలవాలి. పథకాల ఫలితాలను లబ్ధిదారుల జీవితాలతో కొలవాలి. ఆర్థిక వృద్ధిని ఉద్యోగాలతో కలిపి చూడాలి. మౌలిక వసతులను గ్రామీణ-పట్టణ సమానత్వంతో పరిశీలించాలి. రాజకీయ స్థిరత్వాన్ని ప్రజాస్వామ్య సంస్థల బలంతో పాటు అంచనా వేయాలి. పాతికేళ్ల పాలన తర్వాత నాయకుడిని పొగడటమో.. విమర్శించటమో కంటే ప్రజల జీవితాన్ని ప్రశ్నించడం ముఖ్యం.

దేశం ఎంత ముందుకు వెళ్లింది?
సామాన్యుడి కుటుంబం ఎంత ముందుకు వెళ్లింది?
యువత భవిష్యత్తు ఎంత భద్రంగా మారింది?
రైతు బతుకు ఎంత గట్టెక్కింది?
ప్రజాస్వామ్యం ఎంత బలపడింది?

ఈ ప్రశ్నలకు సమాధానాలే 25 ఏళ్ల పాలనా ప్రయాణానికి నిజమైన కొలమానం. మిగిలిన పాతికేళ్ల లక్ష్యం 'వికసిత్ భారత్' అయితే.. ఆ అభివృద్ధి గణాంకాల్లోనే కాదు, ప్రతి సామాన్యుడి జీవితంలో కనిపించాలి. అదే పాలనకు అసలు పరీక్ష.



రణధీర్ గుండు, హైదరాబాద్

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.